# నినాదం


నిఖార్సైన జర్నలిజం

శనివారం, జూన్ 14, 2025 | సంపుటి - 20 | సంచిక 154 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## 16న విచారణకు రండి

### కెటిఆర్‌కు మరోమారు ఎసిబి నోటీసులు



హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ మరోమారు నోటీసులు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఈనెల 16న సోమవారం ఉదయం పది గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అయితే ఈ కేసుకు సంబంధించి గత నెల మే 28న విచారణకు హాజరు కావాల్సిందిగా మే 26వ తేదీన కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపింది. అయితే ఆ సమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన ముగిసిన తర్వాత 2లో

# మా పురోగతిలో భాగస్వామ్యం అవ్వండి

తెలంగాణ అన్ స్టాపబుల్... ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్



### రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రండి

### ప్రతి భాగస్వామ్యం లావాదేవీ కాదు... అది ఒక మార్పు

### 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

హైదరాబాద్ : దేశంలో ఇతర రాష్ట్రాలకు సంక్షేమం, అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పలు దేశాల ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హొటల్ లో 'ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్(ఐబీసీ)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్ 2025'ను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ' మొదట్లో చాలా మంది తెలంగాణ ఏర్పాటు అసాధ్యమన్నారు. కానీ.. ఆనతి కాలంలోనే తెలంగాణ అన్ స్టాపబుల్ అనే స్థాయికి ఎదిగింది. రాష్ట్ర జీడీపీ 16.12 లక్షల కోట్లకు చేరింది. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9%)ను దాటేసింది. తలసరి ఆదాయం ?3.79 లక్షలు. ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగాం. గత 14 నెలల్లో లైఫ్ సైన్సెస్ లో రూ. 40వేల కోట్ల పెట్టుబడులను సాధించాం. 2 లక్షల ఉద్యోగాలు సృష్టించాం. రాష్ట్ర జీడీపీలో సేవల రంగం వాటా 66.3 శాతం. దేశంలో ఇది 55 శాతంగా ఉంది. ఇవి అంకెలు కాదు... తెలంగాణ పురోగతికి నిదర్శనాలు' అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'ప్రతి భాగస్వామ్యం ఒక లావాదేవీ కాదు... అది ఒక మార్పు. అందుకే అంతర్జాతీయ భాగస్వామ్యాలతో తెలంగాణ పురోగతిని మరో అడుగు 2లో

# రైతుభరోసా ఆగదు

### రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిన రేవంత్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుంది
- ఖమ్మం పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా రైతు భరోసా విషయంలో వెనుకడుగు వేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ధీమా వ్యక్తం చేశారు.

ఖమ్మం : శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. రేగులచలక, కోయచెలక గ్రామాల్లో సీసీ రోడ్లు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని అభివర్ణించారు. దేశమంతా పాదయాత్ర చేసి కులగణనకు ఆలోచన చేసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పాలనలో దేశమంతా రూ. 70 వేల కోట్లు రుణమాఫీ చేస్తే.. తెలంగాణలో రూ. 21 వేల కోట్లు- రుణమాఫీ చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఇతర జిల్లాల వారు ఖమ్మంలో నివసించాలనే ఆలోచనలు వచ్చేలా 2లో



## ఇరాన్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం

- మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి మృతి
- ఇరాన్ అణు శాస్త్రవేత్తలు కూడా మరణించినట్లు వెల్లడి

టెహ్రాన్ : ఇరాన్ రాజధాని టెహ్రాన్ పై ఇజ్రాయిల్ మెరుపులు దాడులతో విరుచుకుపడింది. శుక్రవారం ఇరాన్‌లోని నటాంజ్ యురేనియం కేంద్రంతో సహా కీలకమైన ఇరానియన్ అణు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడులు చేసింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇజ్రాయిల్ జరిపిన ఈ వైమానిక దాడుల్లో ఇరాన్ అత్యున్నత సైనిక అధికారి, సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ మొహమ్మద్ బాఘేరితో పాటు- ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధిపతి మేజర్ జనరల్ హోస్సేన్ సలామి, ఇతర సీనియర్ అధికారులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. దీంతో ఇరాన్ సైన్యానికి భారీ దెబ్బ తగిలింది. కాగా, ఈ దాడులపై స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ.. ఇజ్రాయిల్ పై ప్రతీకారం తీర్చుకుంటామని.. కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇజ్రాయెల్ శుక్రవారం తెల్లవారు జామున చేసిన 2లో

## కొమ్మినేనికి సుప్రీంలో ఊరట

- బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం
- మరోమారు ఇలాంటి చర్చలు చేయరాదని హెచ్చరిక



2

## టాటా గ్రూప్ చరిత్రలో ఇదో చీకటి రోజు

- విమాన ప్రమాద ఘటనపై పారదర్శక విచారణ
- ఉద్యోగులకు పంపిన లేఖలో చంద్రశేఖరన్

అహ్మదాబాద్ : టాటా గ్రూప్ చరిత్రలో ఇది అత్యంత అంధకారమైన రోజుల్లో ఒకటని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా క్రాష్ గురించి మరోసారి స్పందించారు. 2లో

## అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలి

### వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్

హైదరాబాద్ : తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడేషన్ల విధివిధానాలను వెంటనే ప్రకటించి, అర్హులైన వారందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. 2లో

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

### ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభం

- హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో పాఠశాలలు ఏర్పాటు
- విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బోధన
- అందుకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు
- అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్



హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్.. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు- నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో మిగతా 2లో

## బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు

- పరిశీలించి సమగ్రనివేదిక ఇవ్వండి
- ఎయిర్ ఇండియాకు డిజిసిఎ ఆదేశాలు



అహ్మదాబాద్ : ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఎయిరిండియాను ఆదేశించింది. 2లో



## రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అరుదు

### టేకాఫ్ కాగానే ప్రమాదానికి అదే కారణం

### బ్లాక్‌బాక్స్ ఆధారంగా ప్రమాద కారణాల విశ్లేషణ

అహ్మదాబాద్ : గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి 241 మంది ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని దిగ్భ్రమలో ముంచింది. ఎందుకిలా జరిగిందన్న విశ్లేషణలు మొదలయ్యాయి. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అన్నది అరుదైన విషయంగా పలువురు నిపుణులు భావిస్తున్నారు. 2లో

# ఇది ఊహించని పెను విషాదం


### బాధిత కుటుంబాల బాధ భరించలేనిది

- ప్రమాదస్థలాన్ని పరిశీలించిన మోడీ
- ప్రమాద వివరాలపై అధికారులతో ఆరా
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- ప్రధాని వెంట సిఎం భూపేంద్రపటేల్, రామ్మోహన్ నాయుడు
- ఘటనపై విమనాశ్రయంలో అధికారులతో సమీక్ష



ఈ ప్రమాదంపై మోదీ స్పందించారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలననంటూ విచారం వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం ఉంటుందని, ఆ వేదనను మాటల్లోనే చెప్పలేమని అన్నారు. ఈ విషాద సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని తెలిపారు.

అహ్మదాబాద్ : అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని ప్రధాని మోడీ పరిశీలించారు. ప్రమాద ఘటనలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఘటనాస్థలానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. మిగతా 2లో



ఘటనపై విమనాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రధాని మోడీ

## సీటు విరిగి ఎగిరిపడడంతో బతికిపోయా

- అంతా క్షణాల్లో జరిగిపోయింది
- ఎలా బతికానో ఆశ్చర్యంగా ఉంది
- మృత్యుంజయుడు రమేశ్ విశ్వాస్ వెల్లడి
- ఆస్పత్రిలో రమేశ్‌ను పరమార్శించిన ప్రధాని మోడీ





## విమాన ప్రమాదంతో అంటుకున్న ఇంధనం

- ఒక్కసారిగా వేయి డిగ్రీల ఉష్ణోగ్రత విడుదల
- సహాయక చర్యలకు తీవ్ర విఘాతం
- సహాయక చర్యలు పర్యవేక్షించిన అధికారుల వెల్లడి

2

# 16న విచారణకు రండి

విచారణకు హాజరువుతానని ఏసీబీకి మాజీ మంత్రి సమాచారం ఇచ్చారు. దానికి అంగీకారం తెలిపిన ఏసీబీ.. తాజాగా మరోసారి కేటీ-ఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

# సీటు విరిగి ఎగిరిపడడంతో బతికిపోయా

అహ్మదాబాద్ : అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం యావద్దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలపై ఏఐ-171 విమానం కుప్పకూలడం తో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. జరిగిందేమిటో తెలుసుకునే లోపు అందరి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అయితే ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయపడి మృత్యుంజయుడుగా నిలిచారు. ఆ భయానక అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. విమానం కూలిపోయిన భయానక క్షణాలను తలుచుకుని భారత సంతతికి చెందిన 40 ఏళ్ల బ్రిటిష్ పౌరుడు రమేష్ విశ్వాస్ కుమార్ రమేష్ చిగురుటాకులా వణికిపోయారు. ప్రస్తుతం ఆసుపత్రులో ఆయన చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా భవంతిలోకి విమానం దూసుకుపోయి పేలిపోయిందని, సెకండ్లలోనే అంతా జరిగిపోయిందని తెలిపారు. తన సీటు సమీపంలో భారీ డ్యామేజ్ జరిగిందని అన్నారు. సీటు ఊడిపోవడం తో పక్కకు పడడంతో తాను బతికానని అన్నారు. అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్ కుమార్ రమేశ్. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ప్రమాద క్షణాలను గుర్తుచేసుకున్నారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు-ఊడి పడిందని, అందువల్లే తాను బతికిబయటపడ్డానన్నారు. నేను విమానం నుంచి దూకలేదు. టేకాఫ్ అయిన కాసేపటికే విమానం ముక్కలైంది. నా సీటు విరిగిపోవడం తో దూరంగా ఎగిరిపడ్డా. అందుకే విమానంలో చెలరేగిన మంటలు నాకు అంటుకోలేదని విశ్వాస్ కుమార్ చికిత్స సమయంలో వైద్యులకు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలు అయ్యాయి. వాటినుంచి కోలుకుంటున్న ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. అంతా నా కళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కాలేదు. విమానం కింద పడగానే నేను కూడా చనిపోయానని అనుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నా. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ వెళ్లా. మంటల ధాటికి నా ఎడమ చేయికి గాయమైంది' అని విశ్వాస్ తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ప్రయాణికుడిని శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్వాస్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బ్రిటన్‌లో నివాసముం టున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు-చేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటు-లో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచు కుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కడే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల బీజే వైద్య కళాశాల వసతిగృహంలో మరో 24 మంది మృతి చెందారు.

# మా పురోగతిలో భాగస్వామ్యం అవ్వండి

ముందుకు తీసుకెళ్లాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆగ్రో ఇన్నోవేషన్, ఏఐ గవర్నెన్స్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ ఫార్మింగ్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, క్లీన్ ఎనర్జీ తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. 'మిగిలిన రాష్ట్రాలు ట్రెండ్‌ను అనుసరిస్తే... తెలంగాణ దాన్ని సృష్టిస్తుంది. అందుకే కేవలం ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే రావొద్దు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు కలిసి రండి' అని పిలుపునిచ్చారు. 'బ్రెజిల్, జర్మనీ, రష్యా, కామెరూన్, మాల్టా, యూకే, బల్గేరియా, బెల్జియం, యూఏఈ, దుబాయి తదితర 25 దేశాల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం శుభపరిణామం. ఇది ఒక సదస్సుగా మిగిలిపోకుండా వివిధ దేశాల మధ్య సంస్కృతి, వ్యూహాలు, టెక్నాలజీ బదలాయింపునకు వారధిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సహకాలను మీ దేశంలోని పారిశ్రామికవేత్తలకు వివరించండి. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించండి' అని కోరారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ డిప్లొమేటిక్ రిలేషన్స్(ఐఓడీఆర్) మాల్టా గవర్నర్ లిల్లో మత్రా, కార్యదర్శి మార్సెల్లో పట్టి, బెల్జియం ఎంపీ ఇవాన్ పెట్రోవ్, జర్మనీ డిప్లొమాట్ డానియల్ జెర్బిన్, అర్జెంటీనా ఎంపీ క్లాడియో సింగోలనీ, ఐబీసీ ఛైర్మన్ సాల్మన్ గట్టు, డైరెక్టర్ గ్లోరియా సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ- ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు- కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు- బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. అందరికీ విద్యనుచేరువ చేయాలన్న లక్ష్యంతో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు- నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేఅవుట్లలో ప్రజల అవసరాల కోసం కోటాయించిన స్థలాల్లో బడులు నిర్మించాలని ఆదేశించారు. గురుకులాల తరహాలో సౌకర్యాల కల్పనపై అధ్యయనం చేయాలని సూచించారు. డేస్కాలర్లకూ భోజనం, యూనిఫామ్, పుస్తకాల సరఫరాపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. పిల్లలకు కుటుంబం, సమాజంపై బాధ్యత తెలిసేలా కౌన్సిలింగ్ ఇప్పించాలని స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన సిపిఆర్‌వో మల్సూర్

హైదరాబాద్,జూన్13 : సిఎం రేవంత్ రెడ్డికి కొత్తగా సీపీఆర్వో గా గుర్రం మల్సూర్ నియమితులయ్యారు. గతంలో అనేక కీలక పదవులు నిర్వహించిన మల్సూర్ నాటి కేంద్రమంత్రి వేణుగోపాలాచారి వ్వవ పిఎస్‌గా కూడా పని చేశారు. తనను సిపిఆర్‌వోగా నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మల్సూర్‌ను అభినందించారు. ఇప్పటి వరకు సిపిఆర్‌వోగా పనిచేసిన అయోధ్యారెడ్డి సమాచార కమిషనర్‌గా నియమితులయ్యారు.

# ఇది ఊహించని పెను విషాదం

ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిలో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు, గుజరాత్ సిఎం భూపేందర్ పటేల్ కూడా ఉన్నారు. అక్క వీరంతా కలియతిరిగి ప్రమాద తీరును పరిశీలించారు. విమానం కుప్పకూలిన ఆనవాళ్లను మోదీ నిశితంగా పరిశీలించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తర్వాత మోదీ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలతోనూ మోదీ మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘవి తదితరులు ఉన్నారు. అనంతరం మరోవైపు ఎయిరిండియా ఎండీ, సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ కూడా ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా నేడు అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జాగిలాల సాయంతో మృతదేహాల కోసం శిథిలాల కింద గాలిస్తున్నారు. ఈ ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒకే ఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. గుజరాత్ మాజీ సీఎం, భాజపా నేత విజయ్ రూపాణీ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇక, ఈ విమానం బీజే వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయంపై కూలిన సంగతి తెలిసిందే. దీంతో అందులోని 24 మంది మృత్యువాత పడ్డారు. విమానంలో 169 మంది భారత పౌరులు కాగా.. 53 మంది బ్రిటన్‌వాసులు, ఇతర విదేశీయులు ఉన్నారు.

## రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అరుదు

అదికూడా టేకాఫ్ అయిన నిముషాల్లోనే జరగడం వంది అరుదని చెబుతున్నారు. ఇంజన్‌లో సాంకేతిక సమస్య వల్లే అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం వల్ల ప్రమాదం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు.ఒక ఇంజన్‌లో సాంకేతికంగా లోపం వస్తే మరో ఇంజిన్‌తో విమానం నడుస్తుంది. కానీ గురువారం జరిగిన అహ్మదాబాద్ ప్రమాద సంఘటనలో రెండు ఇంజన్లు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని అంటున్నారు. ఇదో అరుదైన ఘటనగా వారు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాలు తక్కువని భావిస్తున్నారు.రెండు ఇంజన్లకు ఇంధనం అందకపోవడం వల్ల ఒక్కసారిగా కుప్పకూలి పోయి ఉంటుందని అన్నారు. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానానికి సిగ్నల్ వ్యవస్థ కట్ అయిందని... ఇంధనం కూడా అందలేదని అందుకే విమానం కూలిందని అన్నారు. విమాన ప్రమాదాలను మూడు రకాలుగా చూస్తారు. పక్షులు ఢీ కొట్టినా , వాతావరణం ప్రతికూలంగా ఉన్నా, టెక్నికల్ ఎర్రర్ వచ్చినా ప్రమాదాలు జరుగు తుంటాయి. దేశంలో ఇప్పటి వరకు రెండు ఇంజన్లు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి. బ్లాక్ బాక్స్‌ను డీకోడ్ చేస్తే కెప్టెన్, ఫైలెట్ ఏం అలర్ట్ ఇచ్చారో తెలుస్తుంది. కెప్టెన్ మే డే అని అలర్ట్ అయితే ఏటీసీకి అందజేసినట్లు తెలుస్తోంది. రెండు ఇంజన్లు ఫెయిల్ అయినప్పుడు ఏటీసీ కూడా ఏమీ చేయలేదు . ఏటీసీ కేవలం సిగ్నల్ వ్యవస్థతో పాటు అబ్జర్వేషన్‌ను మాత్రమే చేయగలదని చెప్పుకొచ్చారు. 787 డ్రీం లైనర్ విమానం అత్యంత పటిష్టమైనదన్నారు. టెక్నికల్ సమస్యలు తక్కువగా వస్తాయన్నారు. గత 11 ఏళ్లుగా ఈ విమానం సేవలు అందిస్తోంది. కానీ తాజాగా జరిగిన ప్రమాదంలో మాత్రం 787 డ్రీమ్ లైనర్ కూడా ఫెయిల్ అయింది. నిజానికి విమానం బయలుదేరడానికి ముందు టెక్నికల్ సిబ్బంది తనిఖీలు చేస్తారు. వారు ఎలాంటి ఎర్రర్‌ను గుర్తించకపోవడం అన్నది అనుమానాలకు తావిస్తోంది. అందుకే అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బ్లాక్ బాక్స్ డీకోడ్ చేస్తే అసలు విషయం తెలుస్తుందని నిపుణులు అంటున్నారు. బ్లాక్ బాక్స్‌లో కేవలం పైలట్, కో పైలట్ మాత్రమే వాయిస్ రికార్డు అవుతాయి తప్ప.. ప్రయాణికుల వాయిస్‌లు రికార్డ్ కావు. పైలెట్, కో పైలట్ ప్రయాణికులకు ఏదైనా అలర్ట్ చేసినా, సూచనలు చేసినా అవి రికార్డు అయ్యే ఛాన్స్ ఉంటుది. బ్లాక్ బాక్స్ అనేది మంటల్లో కాలిపోకుండా ఉండే విధంగా దాన్ని రూపొందిస్తారు. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు చూస్తే టేక్ ఆఫ్ అయ్యే సమయంలో మాత్రమే ఎక్కువగా టెక్నికల్ సమస్యలు వచ్చిందన్నారు. ఇప్పటి వరకు టెక్నికల్ సమస్యల ఆధారంగానే ప్రమాద ఘటనపై విచారణ సాగుతోంది. ఇకపోతే ఇందులో విద్రోహానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయా లేవా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తారు.

## అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలి

అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పటిష్ఠమైన ఇన్సూరెన్స్, ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు- తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు- సంజయ్ పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలను ప్రధాని నరేంద్ర మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో తమ పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్నామని, త్వరలో నేపాల్‌కు కూడా విస్తరించబోతున్నట్లు- వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి , కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ- అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం-2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు- డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ జర్నలిస్టులకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు- చెప్పారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## టాటా గ్రూప్ చరిత్రలో ఇదో చీకటి రోజు

శుక్రవారం ఉద్యోగులకు పంపిన భావోద్వేగమైన లేఖలో, చంద్రశేఖరన్ తన బాధను వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తాము షాక్‌లో ఉన్నామని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దీంతోపాటు- ఈ ఘటనపై తాము పూర్తి పారదర్శకంగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మాటలతో సాంత్వన ఇవ్వలేము. కానీ ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని లేఖలో పేర్కొన్నారు. ఎక్కడ తప్పు జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చంద్రశేఖరన్ తన సందేశంలో చెప్పారు. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ నుంచి విచారణ బృందాలు అహ్మదాబాద్‌కు చేరుకున్నాయన్నారు. ఈ క్రమంలో టాటా గ్రూప్ పూర్తి సహకారం వారికి అందిస్తుందని ఆయన వెల్లడించారు. మేము వాస్తవాలను నిర్ధారించిన తర్వాత, ఈ దుర్ఘటన ఎలా జరిగిందో పారదర్శకంగా చెబుతామని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఊహాగానాల విషయంలో సహనం వహించాలని కోరారు. ఒక సాధారణ విమానం ఎందుకు ఇంత పెద్ద విపత్తుగా మారిందో తెలుసుకోవడానికి శిక్షణ పొందిన పరిశోధకులే నిర్ణయించగలరని పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా, టాటా గ్రూప్‌కు చెందింది. ఈ విమానయానాన్ని 2022 జనవరి 27న అధికారికంగా టాటా గ్రూప్ స్వాధీనం చేసుకుంది. ఇది 69 సంవత్సరాల తర్వాత జరిగింది. ఎయిర్ ఇండియా 1932లో ఎయిర్ ఇండియా టాటాచే స్థాపించబడింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్ళే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్, జూన్ 12న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎగురుతున్న వెంటనే మధ్యాహ్నం క్రాష్ అయింది. ఈ ప్రమాదంలో 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో 12 సిబ్బంది ఉన్నారు. టాటా గ్రూప్, ఇప్పటికే ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ప్రకటించింది.

# కొమ్మినేనికి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ : అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్‌లో ఉన్న ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టులో బెయిల్ కోసం కొమ్మినేని దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడ ఆయన బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ.. వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే మరోసారి అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి సుప్రీం ధర్మాసనం సూచించింది. భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కింది కోర్టు విధించిన షరతులకు లోబడే బెయిల్ మంజూరీ చేస్తున్నామని పేర్కొంది. విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం స్పష్టం చేసింది. కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్‌లో అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయనను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై రాజధాని ప్రాంతం సహా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పలేదు. ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు- పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో కొమ్మినేని హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో మరో జర్నలిస్ట్ కృష్ణంరాజుకు కూడా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# విమాన ప్రమాదంతో అంటుకున్న ఇంధనం

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. ప్రమాదానికి కారణమేంటనే దానిపై స్పష్టత రానప్పటికీ.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ విమానం కూలిన తర్వాత ఘటనా స్థలంలో 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక చర్యలు అత్యంత క్లిష్టంగా మారినట్లు- పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, మంటలు వ్యాపించడంతో ఎవరినీ కాపాడే పరిస్థితి లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఒకరు స్పందించారు. ప్రమాదం గురించి సమాచారం రాగానే మధ్యాహ్నం 2-2.30 గంటల ప్రాంతంలో మా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతకుముందే హాస్టల్‌లో శిథిలాల కింద చిక్కుకున్న కొంతమందిని స్థానికులు కాపాడారు. మంటలు వ్యాపించడం ఎక్కువైన తర్వాత పరిస్థితి చేదాటిపోయిందని ఆ అధికారి వివరించారు. గతంలో మేం ఎన్నో సహాయక చర్యలు చేపట్టాం. కానీ, ఇలాంటి విపత్తును ఇంతకుముందెప్పుడూ చూడలేదు. విమానంలోని ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో అగ్నిగోళం ఏర్పడింది. క్షణాల వ్యవధిలోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో బయటపడే అవకాశం లేకుండా పోయింది. మేం పీపీఈ కిట్లు- వేసుకొని ఘటనాస్థలానికి చేరుకున్నా.. వేడి తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. పక్షులు, శునకాలు కూడా పారిపోలేనంత స్థాయిలో ఉష్ణోగ్రత ఉంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పలు పక్షులు, శునకాలు కాలిబూడిదయ్యాయి. ఎటుచూసినా శిథిలాలే కన్పించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికులను గుర్తించడం సవాల్‌గా మారిందని మరో అధికారి ఆ భయానక దృశ్యాలను గుర్తుచేసుకున్నారు. ఈ ప్రమాదంలో విమానంలోని 241 మందితో పాటు- వైద్యకళాశాల హాస్టల్‌లో ఉన్న 24 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలకు అహ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. ప్రమాదం ధాటికి చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు.

# రైతుభరోసా ఆగదు

ఖమ్మం నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. అధికార పార్టీ వారు సర్పంచ్‌లు.. ఎంపీటీసీ జెడ్పీటీసీలుగా ఎన్నికైతే ప్రజలకు చేరువ కావొచ్చని మంత్రి చెప్పారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. రైతు సంక్షేమమే ప్రజా పాలన ధ్యేయమని చెప్పారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని అన్నారు. ప్రజాభిమానం ఉంటే పదవులు అవే దక్కుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల రుణభారం తగ్గించేందుకు పాత రుణాల మాఫీ పూర్తయ్యిందని మంత్రి తెలిపారు. రైతు బంధు పేరుతో గతంలో అన్ని పథకాలు ఆపేశారు. కానీ ఇప్పుడు అన్నింటినీ ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ వస్తున్నాం. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లోకి నేరుగా వెళ్లింది రూ.36,000 కోట్లని వెల్లడించారు. విత్తనాల విషయంలో నకిలీ విత్తనాలను అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ విత్తనాల విషయంలో పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల విషయంలో షిప్ రాకపోవడం వల్ల ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అన్ని జబ్బులకూ కారణం యూరియా. కేంద్రానికి కూడా సలహా ఇచ్చాను. యూరియా తగ్గిస్తే మన పంటలకు ప్రపంచ మార్కెట్ లో విలువ పెరుగుతుందని అన్నారు. డ్రై ల్యాండ్ పంటలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు-, గతంలో ఇచ్చినట్లే ఇప్పుడు కూడా మద్దతు ఇస్తామని చెప్పారు. తోటలు వేసిన రైతులకు కూడా రైతు భరోసా ఇచ్చే యోచనలో ఉన్నామన్నారు. పెంచిన మద్దతు మొత్తం రూ.6,000. మునుపు రూ.5,000 ఇస్తే, ఇప్పుడు పెంచాం అని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిపై ప్రాముఖ్యత పెరుగుతోంది. కొణిజర్లలో రిఫైనరీ, సీడ్ గార్డెన్ ఏర్పాటు- అవుతుంది. ఇది దేశంలో ఎక్కడా లేనిది. వచ్చే సీజన్‌కు వెంసూర్, కొణిజర్ల ఫ్యాక్టరీలు సిద్ధం చేస్తాం అని వెల్లడించారు. తెలంగాణలో మినిమం గ్యారెంటీ- ప్రైస్ ఉండాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి ప్రధానిని కలిసి ఒత్తిడి తీసుకురాగలమని భావిస్తున్నాం అని తెలిపారు. తెలంగాణ వరి ఉత్పత్తిలో టాప్ లో ఉందని గుర్తుచేశారు. కాళేశ్వరంపై ఈటల రాజేందర్ ఆరోపణలపై స్పందిస్తూ, కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజాధనం దుర్వినియోగం కాకూడదు, కానీ అభివృద్ధి జరగాలని అన్నారు. అలాగే మార్కెట్ చైర్మన్ నియామకం ఎమ్మెల్యే పరిధిలో జరిగిందని పేర్కొన్నారు.

# ఇరాన్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం

దాడులతో ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి కూడా ఈ దాడిలో మృతి చెందినట్లు- ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. దీనిని ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్ఎన్ఎన్ ధ్రువీకరించింది. ఇక ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటికే ఇరాన్ టాప్ అణుశాస్త్రవేత్తలు కూడా మరణించారు. వీరితోపాటు- సైన్యంలోని సీనియర్ జనరల్స్ కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐఆర్‌జీసీ చీఫ్ స్సేన్ సలామీ కూడా ప్రాణాలు కోల్పోయారు. బాఘేరి టెహ్రాన్‌లో జన్మించారు. ఆయన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌లో చాలాకాలం పనిచేశారు. 2016లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. దేశంలో ఇదే అత్యున్నత సైనిక పదవి. మిలిటరీ ఇంటెలిజెన్స్‌లో ఆయన నిపుణుడు. 1980లో ఐఆర్‌జీసీలో చేరి ఇరాన్-ఇరాక్ యుద్ధంలో పోరాడారు. పొలిటికల్ జియోగ్రఫీలో ఆయన పీహెచ్‌డీ చేశారు. బాఘేరి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అమెరికా, కెనడా, యూకే, ఐరోపా సమాఖ్య ఆయనపై ఆంక్షలను విధించాయి. 2022-23లో మాషా అమిని మృతికి నిరసనగా చేపట్టిన ఆందోళనలను కూడా ఆయనే అణచివేశారు. ఇజ్రాయెల్ చేసిన దాడులకు తాము ప్రతీకారం తీర్చుకొంటామని ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ ప్రకటించారు. -టె-ల్‌అవీవ్‌కు తీవ్రమైన శిక్షను విధిస్తామన్నారు. -టె-హ్రాన్‌పై ఇజ్రాయెల్ తొలుత దాడులు చేసింది. ఆ తర్వాత శు క్రవారం ఉదయం రెండో దశ దాడులు ప్రారంభించినట్లు- స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని న్యూక్లియర్ ఎ÷-లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్ అవీవ్ విరుచుకుపడుతోంది. ఇప్పటికే ఐదు విడతలుగా దాడులు చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రం ధ్వంసమైందని ఐఏఈఏ (అంతర్జాతీయ అణుశక్తి సంసంథ) ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ చీఫ్ గ్రోసీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఐఏఈఏ ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన చెందుతూ.. ఇరాన్‌లో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తోంది. రేడియేషన్ లీకేజీ స్థాయిపై సమాచారం కోసం ఇరాన్ అధికారులను సంప్రదిస్తోంది. ఆ దేశంలో మా పరిశీలకులతో కూడా టచ్‌లో ఉన్నాం' అని పేర్కొన్నారు.

# బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు

ఈ మేరకు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అహ్మదాబాద్-గాట్విక్ ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైన దృష్ట్యా.. బోయింగ్ విమానాల్లో మెరుగైన భద్రతా తనిఖీలు చేయాలి. సంబంధిత ప్రాంతీయ డీజీసీఏ కార్యాలయాల సహకారంతో తక్షణమే వీటిని చేపట్టాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. విమానాలు బయలుదేరే ముందు ఇంధనం పర్యవేక్షణ, క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల పున:పరిశీలన వంటి తనిఖీలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేసింది. వీటితోపాటు- ÷-లఫైట్ కంట్రోల్ ఇన్‌స్పెక్షన్‌ను ప్రవేశపెడుతున్నామని, ఇంజిన్ సామర్థ్యాలకు సంబంధించిన తనిఖీలను రెండు వారాల్లో పూర్తిచేయాలని ఎయిరిండియాకు సూచించింది. బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాల్లో గత పదిహేను రోజుల్లో తరచుగా సంభవించిన సమస్యలను వీలైనంత త్వరగా సమీక్షించుకోవాలని సూచించింది. సమీక్ష తర్వాత నిర్వహణ చర్యలను ముగించాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది. సంబంధిత తనిఖీల నివేదికను డీజీసీఏకు అందజేయాలని సూచించింది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. బోయింగ్ కంపెనీకి చెందిన 787 డ్రీమ్‌లైనర్ విమానం క్రాష్ అయ్యింది. ఈ ప్రమాదంలో 241 మంది మృతిచెందగా ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో




బయటపడ్డాడు. విమాన ప్రమాదం వందలాది కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో భారత పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన బోయింగ్ విమానాలను తనిఖీ చేసి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించింది. గత 15 రోజుల్లో బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాలలో వచ్చిన పునరావృత సాంకేతిక లోపాలు (స్నాగ్‌లు) సమీక్షించాలని, వాటికి సంబంధించిన అన్ని నిర్వహణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

# మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్

### అమృత సంకల్ప్ క్లినిక్ ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,జూన్13 : మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్ సరైన మార్గమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లో అమృత సంకల్ప్ పేరుతో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మానసిక అనారోగ్యాన్ని కేవలం అనారోగ్య సమస్యగా మాత్రమే కాదని, వెల్‌నెస్ లెన్స్ ద్వారా కూడా చూడాలని అన్నారు. ఈ మార్పునకు నాయకత్వం వహించడానికి డాక్టర్ సురేంద్ర ముందుకు రావడం ప్రశంస నీయమని కొనియాడారు. దీర్ఘకాలిక భావోద్వేగ స్థితిస్థాపకతను పెంపొందించడంతో పాటు- మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే క్లినిక్ సమగ్ర విధానాన్ని ఆయన ప్రశంసించారు. మీ క్లినిక్ పిల్లలు, పెద్దలు, వృద్ధులకు క్రమబద్ధమైన సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. దీంతో ఒత్తిడి, ఆందోళన, నిరాశ, సంబంధ సమస్యలు, ఓసీడీ, వ్యసనంతో పాటు- మరింత తీవ్రమైన పరిస్థితులతో సహా విస్తృతశ్రేణి సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో పాటు- ముఖ్యమైనదని కేటీ-ఆర్ అన్నారు. ప్రస్తుతం ఉన్న జీవనశైలి వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు- మానసిక ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనదిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడుతోంది. కేవలం శారీరక బాధలు మాత్రమే కాకుండా, మానసిక రుగ్మతలు, సమస్యల



విషయంలో కూడా ప్రజలు అవసరమైన వైద్యుల సహాయాన్ని పొందాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సందర్భంలో ఈ రోజు ప్రారంభించిన ఈ తరహా సౌకర్యాలు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అనేక మానసిక సమస్యలను తల్లిదండ్రులకు, స్నేహితులకు చెప్పుకునే పరిస్థితి లేకపోవడం వల్ల... మానసిక నిపుణులు, మానసిక వైద్యుల సహకారంతో స్వాంతన పొందే అవకాశం కలుగుతుంది. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోవడం అనేది అవమానకరం కాదనే విషయాన్ని సమాజం అర్థం చేసుకోవాలి. దీనిపై ఉన్న నెగటివ్ అభిప్రాయం మారాల్సిన అవసరం ఉంది.' అని కేటీఆర్ అన్నారు. మానసిక సమస్యల కారణంగా చాలామంది ఆత్మహత్య లాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ప్రాణం కోల్పోవడం కంటే మానసిక చికిత్స తీసుకోవడం ఎంతో సులభమనీ విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. అమృత సంకల్ప్ మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజానికి తిరిగి ఇవ్వడం నా మార్గం అని డాక్టర్ సురేంద్ర అన్నారు. అమృత సంకల్ప్ అనేది కేవలం ఒక క్లినిక్ మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా పరిష్కరించాలి అనే దానిని పునర్నిర్మించడానికి ఇది ఒక ఉద్యమం అని తెలియజేశారు.

## బిడ్డ కోసం కలలు కన్న యువకుడు

### పురిట్లోనే బిడ్డ మరణం తట్టుకోలేక ఆత్మహత్య

నిజామాబాద్,జూన్13 : జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ యువకుడు ఆత్మహత్య కలకలం రేపుతోంది. సాయిలు అనే యువకుడు ఆస్పత్రి ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సాయిలు బలవన్మరణానికి గల కారణాలు తెలిసి అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్త మరణంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అప్పుడే పుట్టిన బిడ్డ అనారోగ్యంతో మరణించడంతో ట్టుకోలేక పోయిన సాయిలు అనే యువకుడు ఉరేసుకుని ఆస్పత్రి ఆవరణలో మృతి చెందాడు. జిల్లాలోని జుక్కల్ మండలం మాహమ్మదా బాద్ గ్రామానికి చెందిన పానుగంటి సాయిలుకు కొద్ది నెలల క్రితం వివాహం జరిగింది. భార్య గర్భవతి కావడం, భార్యకు పురిటి నొప్పులు రావడంతో డెలివరీ కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాడు. మరికొద్ది గంటల్లో తమకు బాబో, పాపో పుట్టబోతున్నారని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ వారి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. డెలివరీ తర్వాత వైద్యులు చెప్పిన విషయంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సాయిలు భార్యకు పండంటి మగ బిడ్డ జన్మించాడు. దీంతో కుటుంబసభ్యులతో పాటు సాయిల ఆనందం అంతా ఇంతా కాదు. కానీ బాబు పుట్టిన వెంటనే అనారోగ్య సమస్యతో మరణించాడు. ఈ విషయాన్ని సాయిలుకు చెప్పారు ఆస్పత్రి సిబ్బంది. పుట్టిన బిడ్డను చూడాలని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న యువకుడికి కుమారుడి మరణవార్త విని చలించిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సదరు యువకుడు ఆస్పత్రి ఆవరణలోనే ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలిసిన భార్య తీవ్రంగా విలపించింది. ఓ వైపు అప్పుడే పుట్టిన బిడ్డ, మరోవైపు కట్టుకున్న భర్త ఇలా బలవన్మరణం చెందడంతో ఆ భార్య బాధ వర్ణణాతీతం. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయిలు మృతితో మహమ్మదాబాద్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## కొమ్మినేని వ్యవహారంతో ఎల్లో కుట్రలు బట్టబయలు

### మాజీమంత్రి, వైకాపా నేత కారుమూరి నాగేశ్వర రావు

ఏలూరు,జూన్13 : అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి కూటమి నేతలు కృషి చేస్తున్నారని మాజీమంత్రి, వైకాపా నేత కారుమూరి నాగేశ్వర రావు అన్నారు. విశ్లేషకుడి వ్యాఖ్యలతో యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేనికి ఏం సంబంధం అంటూ? సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసిందన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు కావని ట్వీట్‌లో పేర్కొన్నారు. తన ఎల్లో ముఠాతో కలిసి చంద్రబాబు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి, తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేనికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోందని మండిపడ్డారు.

## 9 ఏళ్ల క్రితం కేసు కొట్టేయండి

### 20కి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్ : తొమ్మిదేళ్ల క్రితం గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ- గదిని జేసీబీతో కూల్చివేశారని, కులం పేరుతో దూషించారని రేవంత్‌రెడ్డితో పాటు- ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్ది రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై పెద్దిరాజుకు నోటీ-సులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

## ఎసిబి కేసుల్లో నిజాలు తేలుద్దామా

### లై డిటెక్టర్ పరీక్షకు సిఎం రేవంత్ సిద్ధమా

### ఎక్స్ వేదికగా సవాల్ విసిరిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్,జూన్13 : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసెడింట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడు..ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం, బ్యాంకు ద్వారా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపాడు. చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతోపాటు-.. విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తానని మాటిస్తున్నాను. అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉంది. ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా? అని ప్రశ్నించారు. ఓవైపు మీ దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను చాటుకుంటున్న ఈ తరుణంలో.. విచారణల కోసం ప్రజాధనాన్ని వృధా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలని పేర్కొన్నారు. కేటీఆర్‌కు తాజాగా ఏసీబీ నోటీ-సులు జారీ చేసింది. ఫార్ములా ఈ కారు రేసు కేసులో జూన్ 16న విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. ఆ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌పై దుయ్యబట్టారు.

## ఎసిబి నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే

### ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూన్13 : ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎంఎల్ఏ హరీష్‌రావు ఎక్స్ వేదికగా ఆరోపించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టు-బడులు కూడా వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నోటిసుల ప్రతాపం..? అని ప్రశ్నించారు. 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయారని, అలాంటిది బిఆర్ఎస్ ప్రభుత్వం,కెటిఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కి తీసుకొని వచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టు-బడులను ఆకర్షించారని, అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టు-బడి పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపిందని మండిపడ్డారు. అందాల పోటీ-తో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కెటిఆర్‌కి ఎసిబి నోటీసులు ఇచ్చిందని స్పష్టమవు తున్నదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని రకాలుగా వేధించినా ఆయన వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బిఆర్ఎస్ ఆపదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## తల్లికి వందనంపై దుష్ప్రచారాలు

### అసత్య ఆరోపణలపై క్షమాపణలు చెప్పాలి

### వైకాపా నేతలకు మంత్రి లోకేశ్ హెచ్చరిక

విజయవాడ,జూన్13 : తల్లికి వందనంలో రూ.13వేలు ఇచ్చి రూ.2వేలు తన ఖాతాల్లో పడ్డాయన్న వైకాపా నేతల ఆరోపణలపై మంతరి లోకేశ్ ఘాటుగా స్పందించారు. వీటిపై తీవ్ర పరిణామాలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. రూ.2వేలు నా ఖాతాలో పడినట్టు రుజువు చేయాలి, లేకుంటే క్షమాపణ చెప్పి.. ప్రకటన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే వారిపై చట్టప్రకారం ముందుకెళ్తానని తేల్చి చెప్పారు. అసత్య ఆరోపణలని గతంలో మాదిరి ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేసేవారు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.వైకాపా హయాంలో విద్యాశాఖను నాశనం చేశారు. గతంలో విద్యాశాఖ మంత్రి ఏం చేశారో మాకు తెలియదు. ప్రభుత్వ బడుల్లో ఎంతమంది చదువుతున్నారో తెలుసుకునేందుకు వందరోజులు పట్టిందని మంత్రి లోకేశ్ అన్నారు.రాష్ట్రంలోని 80శాతం మంది పాఠశాల విద్యార్థులకు కిట్‌లు అందించామని లోకేశ్ తెలిపారు. స్కూళ్లు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు అందించాం. మిగిలిన 20శాతం మందికి ఈనెల 20వ తేదీ లోపు అందిస్తాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తాం. కొందరి ఖాతాలు యాక్టివ్ లేక నిధులు తిరిగి వచ్చాయి. ఆయా ఖాతాలు యాక్టివ్ చేసుకోవాలని తల్లులను కోరుతున్నాం. ఖాతాలు యాక్టివ్ అయ్యాక తల్లికి వందనం నగదు వేస్తాం. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. 9,600 పాఠశాలల్లో వన్ క్లాస్- వన్ టీచర్ మోడల్ తీసుకొచ్చాం. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ అంటే ఏంటో ఏడాదిలో చూపిస్తాం. ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ ఉచిత కరెంట్ ఇస్తున్నాం. సోమవారం నాటికి ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేస్తాం. మెగా డీఎస్సీ నియామక పక్రియ జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ బడుల్లో నాణ్యత పెంచాలనేదే మా లక్ష్యం అన్నారు. అంగన్వాడీ పిల్లలకు తల్లికి వందనం వర్తించదు.

## కూటమి కుట్రలను గుర్తు పెట్టుకుంటాం

### అక్రమ కేసులపై పోరాటంలో లీగల్ సెల్ పనితీరు భేష్

### వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సదస్సులో అంబటి రాంబాబు

గుంటూరు,జూన్13 : తమ పార్టీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయిస్తున్న కేసుల విషయంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అద్భుతంగా పనిచేస్తోందని మాజీ మంత్రి, గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు ప్రశంసించారు. శుక్రవారంగుంటూరులో జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సదస్సు నిర్వహించారు. ఇందులో అంబటి రాంబాబు, పోతిన మహేష్, మాజీ ఎంపీ మాదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డిలతో పాటు- జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటు- ఏడు నియోజకవర్గాల నుంచి న్యాయవాదులు భారీ స్థాయిలో తరలివచ్చారు. దీనిలోభాగంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 'కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నాయకులు పై తప్పుడు కేసులో బనాయిస్తోంది. ఒక్కొక్కరి పైన 10 కేసులు తక్కువ పెట్టడం లేదు. పార్టీ నాయకుల్ని కార్యకర్తలని వేధించాలన్న లక్ష్యంతోనే అక్రమ కేసులతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ప్రభుత్వం బనాయించే అక్రమ కేసులపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అద్భుతంగా న్యాయపోరాటం చేస్తుంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు లీగల్ సెల్ అండగా ఉండి మేమున్నాము అనే భరోసా కల్పిస్తోంది. గుంటూరు జిల్లా లీగల్ సెల్ అద్భుతంగా పనిచేస్తుంది వారికి అభినందనలని పేర్కొన్నారు. రాష్ట్రంలో హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది.. రాష్ట్రంలోని ప్రజల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆస్తులు ధ్వంసం చేశారు. ప్రభుత్వం పథకం ప్రకారమే అక్రమ కేసులు బనాయిస్తోంది. ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధుల న్యాయపోరాటం అద్భుతం' అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక పథకం ప్రకారం.. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేస్తోంది. యాక్టివ్‌గా ఉన్న కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తోంది. సోషల్ మీడియా వారి పైన కూడా ఒక్కొక్కరిపై 10కి తగ్గకుండా కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పారు. ప్రభుత్వమే వ్యవస్థీకృత నేరానికి పాల్పడుతోంది.

## నగరంలో పలుచోట్ల వర్షం

### చురుకుగా కదులుతున్న రుతుపవనాలు

### అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సూచన

హైదరాబాద్,జూన్13 : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాలపై వెళున్న వాహనదారులు తడిసి ముద్దయ్యారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించడంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి.. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులపాటు- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ విభాగం వెల్లడించింది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురవచ్చని.. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండతో పాటు- వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం కురిసింది.ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంత వరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతా ల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించే దానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్య లు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డిజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంట ర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ- వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని కమిటీ- నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

## అహ్మదాబాద్ ప్రమాదంలో బ్లాక్‌బాక్స్ లభ్యం

### దర్యాప్తులో కీలకం కానున్న డేటా

అహ్మదాబాద్,జూన్13 : అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు- తెలిపింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. విమానంలో కీలకంగా ఉండే బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే వీలు కలుగుతుంది. ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బాక్స్‌లు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటాను రికార్డ్ చేయగా.. మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డుకు ఉపయోగపడుతుంది. విమానాలకు ఏదైనా ముప్పు వాటిల్లినప్పుడు, అత్యవసర పరిస్థితిని తెలియజేస్తూ 'మేడే' అంటూ సమీపంలోని ఏటీసీకి పైలట్ ఓ సందేశాన్ని పంపుతారు. వీటితోపాటు పైలట్-కోపైలట్‌ల సంభాషణలన్నీ డీఎఫ్‌డీఆర్‌లో రికార్డవుతాయి. ఈ డీఎఫ్‌డీఆర్‌నే బ్లాక్‌బాక్స్‌గా వ్యవహరిస్తారని ఏఏఐబీ తెలిపింది.

## సత్యనారాయణ వ్రత టిక్కెట్ల ధర 200 పెంపు

### యాదగిరిగుట్ట ఇవో ఉత్తర్వులు

యాదగిరిగుట్ట,జూన్13 : ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం కోసం నిత్యం వేల మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇక, పండుగలు, ప్రత్యేక పర్వదినాలు, వారాంతాల్లో యాదగిరిగుట్టలో రద్దీ భారీగా ఉంటుంది. అయితే, యాదాద్రి ఆలయానికి వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది ఇక్కడ సత్యనారాయణ స్వామి వ్రతం చేయించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు.ఈ క్రమంలో ఆలయ దేవస్థానం అధికారులు నరసింహస్వామి భక్తులకు షాక్ ఇచ్చారు. వ్రతం టికెట్ ధరను భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. యాదగిరిగుట్ట దేవాలయంలో నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతం టికెట్ ధరలను పెంచుతూ ఈవో వెంకట్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు యాదాద్రిలో వ్రతం టికెట్ ధర రూ. 800గా ఉండగా.. దాన్ని ఇప్పుడు రూ. 1000కి పెంచారు. సత్యనారాయణ స్వామి వ్రతం విషయానికి వస్తే.. అన్నవరం తర్వాత ఎక్కువగా యాదగిరిగుట్టలోనే వ్రతాలు చేయించుకుంటారు. ఇప్పుడీ టికెట్ రేటు పెంచడంపై భక్తులు ఆగ్రహంచెందారు. ఇప్పటివరకు టికెట్ తీసుకుంటే.. భక్తులకు పూజా సామగ్రిని ఇచ్చేవారు.. ఇక, ఇప్పటి నుంచి ఈ టికెట్ మీద భక్తులకు పూజ సామగ్రితో పాటుగా స్వామివారి శేష వస్త్రాలు అలాగే, సత్యనారాయణస్వామి విగ్రహ ప్రతిమ కూడా అందజేయనున్నారు. పెరిగిన టికెట్ ధరలు వెంటనే అమల్లోకి రానున్నాయి.

## సంపాదకీయం

# మితిమీరిన ట్రంపరితనం !

ట్రంప్ కాలుమోపి అప్పుడే ఆరునెలలు కావస్తోంది. ఈ ఆరు నెల్లలో అమెరికా పతననానికి పునాదులు వేశాడనే చెప్పాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదంతో చేస్తున్న చేష్టలు వెగటు పుట్టిస్తున్నాయి. ఎంతగా అంటే అమెరికన్‌లే ట్రంప్‌ను ఏకి పడేస్తున్నారు. అధ్యక్షుడి చర్యలను ఈసడించుకుంటున్నారు. చివరకు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఇలా లాస్‌ఎంజిల్స్‌లో ఆందోళనలు పరాకాష్టకు చేరిన నిరసనలుగా చూడాలి. వారిపై మిటిటరీని ప్రయోగించడం, విదేశీ హస్తం ఉందని చెప్పడం, ట్రంప్ చేతగాని పాలనకు నిదర్శనంగా చూడాలి. అమెరికాలో ఎప్పటినుంచో వలసవ చ్చి అకడే కూలీనాలీ చేసుకుంటున్న వారిపై దాష్టీకం ప్రదర్శించడం ట్రంప్‌కే చెల్లింది. నిజానికి వారు లేకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇతర దేశాల ప్రజలు చెమటోడ్చి అమెరికా ఆర్థికవ్యవస్థను నిలబెడుతున్నారు. ఇది ట్రంప్ గమనించక పోవడం దౌర్భాగ్యం. ట్రంప్ 'ప్రాజెక్టు 2025' పేరుతో అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల్లో భాగంగా అధికారంలోకి రాగానే అనేక అంశాల్లో వేలు పెడుతూ పోతున్నాడు. తనకు తోచిన నిర్ణయాన్ని ప్రకటి స్తున్నాడు. ఇతర దేశస్తలను పురుగుల్లాగా చూస్తున్నాడు.. అక్రమంగా వలస వచ్చిన వారిని స్వదేశాలకు పంపాలి. లేకపోతే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని ఇచ్చిన ఆదేశాలతో లాస్ ఏంజల్స్ నగరం ఇప్పుడు ఆందోళనలతో అట్టుడుకుతోంది. కొద్ది రోజులుగా అక్రమ వలసదారుల పేరుతో కొంత మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టటంతో వారంతా వీధుల్లోకి వస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు ట్రంప్ సర్కార్ మిలిటరీని దింపింది. వలసదారులు శత్రు దేశాల మాదిరి లాస్ ఏంజల్స్‌ను ఆక్రమించుకున్నట్లుగా చిత్రించి నగరాన్ని విముక్తి చేయాలని ట్రంప్ ఆదేశించడం అవివేక చర్య తప్ప మరోటి కాదు. ఆ రాష్ట్ర గవర్నరే దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు.. అక్రమ వలసదారులుగా చెబుతున్నవారు అమెరికాలో కోట్లాది మంది ఉన్నారు. అక్కడ తలెత్తిన ఆర్థిక, ఉపాధి సమస్యలను పరిష్కరించటంలో విఫలమైన పాలకులు వలస వచ్చిన వారే అన్నింటి కీ కారణమంటూ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. కాకపోతే ఈ విషయంలో ట్రంప్ ముందున్నాడు. అక్రమ వలసదారులను ఏరివేసే పేరుతో ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నగరమంతటా వందలాది మందిని అరెస్టు చేయటాన్ని జనం నిరసిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు దిగారు. తమ అధికారాన్ని అతిక్రమించి మిలిటరీని దించటాన్ని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ న్యూసమ్ కోర్టులో సవాలు చేశాడు. వెనక్కు తగ్గేది లేదని ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మరింతగా రెచ్చగొడుతూ ప్రకటించాడు. విదేశీ వ్యతిరేకత, ఉన్మాదాలను రెచ్చగొడుతున్నారు. కేవలం నిరసన ప్రదర్శనలు జరిగిన వెంటనే ట్రంప్ తీసుకున్న ఈ అసాధారణ చర్య ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.ట్రంప్ తీరుతో ప్రస్తుతం లాస్ ఏంజల్స్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అణచివేత ఏ రూపం తీసుకుంటుందో, దానికి ప్రతిఘటనలో ఏం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. నిజానికి  చౌకగా పని చేయించుకొని లాభాలు పొందేందుకు అమెరికా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, వ్యవసాయ క్షేత్రాల వారు వలసలను ప్రోత్సహించారు. చట్టబద్ధం గా వచ్చిన వారితో పాటు అక్రమంగా వచ్చిన వారిని చూసీచూడనట్లు అధికార యంత్రాంగం వ్యవహరిం చింది. అయితే వీరంతా చెమటోడ్చడం వల్లనే అక్కడి ప్రగతిరథచక్రాలు కదులుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర తక్కువేమీ కాదు. వ్యవసాయం, సేవారంగం, నిర్మాణ రంగాలలో వారు కీలక పాత్ర పోషిస్తు న్నారు. ఇలాంటి వారివల్ల లాభాలు పొందుతున్న వారు మాత్రంకిమ్మనడం లేదు. వీరు వెళ్లిపోతే ఆయా పనులు చేసేందుకు అమెరికాలో ఒక్కరంటే ఒక్కరుకూడా మిగలరు. కరోనా తరువాత ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, ద్రవ్యోల్బణం తగ్గటానికి వలస కార్మికులు తోడ్పడ్డారని డాలస్ ఫెడరల్ రిజర్వుబ్యాంకు అధ్యయనం తెలిపింది. అమెరికాలో పుట్టి పెరిగిన వారు ఉద్యోగ విరమణ చేయటం, జననాల రేటు తగ్గిన కారణంగా 2019–21 మధ్య 20 లక్షల మంది కార్మికులు తగ్గినట్లు, రానున్న పది సంవత్సరాలలో వలస కార్మికులు లేకపోతే వివిధ రంగాలలో ముఖ్యంగా వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఈ పరిణామం తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరికలు వెలువడ్డాయి.  రానున్న సంవత్సరాల్లో వంట, ఇంటి పనివారు, డ్రైవర్లు, ఆరోగ్య, వ్యక్తిగత సంరక్షణ వంటి పనులు చేసేందుకు డిమాండ్ పెరగనుందని చెబుతున్నారు. వలస వచ్చిన వారి కారణంగానే స్థానికులకు అందాల్సిన సౌకర్యాలకు కోత పడుతున్నదని కొందరు సర్వేలు, బడ్జెట్ల పేరుతో రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు. వలస వచ్చిన వారి గృహ వసతి కోసం న్యూయార్క్ వంటి నగరాల్లో బడ్జెట్ కేటాయింపులు చేస్తూ ఇతరులకు కోత పెడుతున్నారని చిత్రిస్తున్నారు. నిజానికి పైన చెప్పుకున్నట్లుగా వలస వచ్చిన వారి నుంచి వచ్చే రాబడితో పోల్చుకున్నపుడు ఇవి పెద్ద మొత్తాలేమీ కాదు. వారు పని చేస్తున్న పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ రంగాల నుంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం పన్నులు మరొక రూపంలో అదనంగా నిధులు సేకరించటాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ వారికి నానాటికీ మరిన్ని రాయితీలు ఇస్తున్నారు తప్ప అదనపు రాబడికి పూనుకోవటం లేదు. తక్కువ వేతనాలకు పని చేసే నైపుణ్యం అంతగా అవసరం లేని కార్మికులు ఇప్పుడు అమెరికాకు అవసరమని తెలిసినప్పటికీ ట్రంప్ వారి మీద దాడి ప్రారంభించాడు. లా÷– ఏంజిల్స్ భగ్గుమనడానికి కారణం కూడా ఇదే. ఎప్పుడో ఏళ్ల క్రితం వచ్చి అమెరికానే తమదేశంగా స్థిరపడిపోయిన వారిపై దాడి చేయడం దారుణం కాక మరోటి కాదు. వారు లేకుంటే ఏ పనీ నడవదని ట్రంప్‌కు కూడా తెలుసు. అయితే మూర్ఖుల నిర్ణయాలకు ప్రజలు బలి కావాల్సి ఉంటుంద్న నిజానన్ని ట్రంప్ రుజువు చేస్తున్నారు.

# ట్రంప్ తీరుతో అమెరికాలో అలజడి



### ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న ఆందోళన
### స్థానిక గవర్నర్లు సైతం ట్రంప్‌పై అసంతృప్తి

వాషింగ్టన్ : ఎన్నికలకు ముందే వలస కార్మికులను పంపివేస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఆ మేరకు ఇప్పుడు లాస్ ఏంజల్స్ నగరంలో చిచ్చు పెట్టాడు. సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ డిమాండ్ చేశాడు, ట్రంప్ చర్య రాష్ట్ర సార్వభౌమత్వాన్ని హరించటమే అన్నాడు. శాంతి భద్రతలకు విఘాతం కలగాలని వాంఛిస్తున్న ట్రంప్‌కు అలాంటి అవకాశం ఇవ్వవద్దని పౌరులను కోరాడు. నగర మేయర్ కరేన్ బాస్ కూడా గవర్నర్‌ను సమర్థిస్తూ ట్రంప్ చర్య అశాంతిని రెచ్చగొట్టినట్లు ఆమె వ్యాఖ్యానించారు. నగర కౌన్సిల్లోని 15 మంది సభ్యులు కూడా మిలిటరీ చర్యను ఖండించారు. వారి వైఫల్యం కారణంగానే తాను మిలిటరీని పంపినట్లు ట్రంప్ సమర్థించుకున్నాడు. అమెరికన్ కమ్యూనిటీ సర్వే ప్రకారం వలస వచ్చిన వారు ఫెడరల్ ప్రభుత్వానికి 2022లో 383 బిలియన్ డాలర్లు, రాష్ట్ర, స్థానిక సంస్థలకు 196 బిలియన్ డాలర్లు రాబడి చేకూర్చారు. నమోదు కాని కార్మికులు, ఆదాయ, సామాజిక భద్రత పన్నులే మొత్తం వంద బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయి. చిత్రం ఏమిటంటే నిరుద్యోగ, ఆరోగ్య బీమా వారికి వర్తించకపోయినా పన్ను చెల్లించారు. 2033 నాటికి మరో 5.2 శాతం వలస కార్మికులు పెరుగుతారని వారి వలన ఏడు లక్షల కోట్ల డాలర్ల మేర తోడవుతుందని, జిడిపి 8.7 లక్షల కోట్ల డాలర్లు పెరగటంతో పాటు ఫెడరల్ ప్రభుత్వానికి 1.2 లక్షల కోట్ల పన్ను ఆదాయం పెరిగి, 900 బిలియన్ డాలర్ల లోటు తగ్గుతుందని అంచనాలు వెలువడ్డాయి. అంటే తమకు ఎలాంటి హక్కులు లేకున్నా పన్నులు మాత్రం చెల్లిస్తున్నారు. వెట్టిచాకిరీ చేస్తున్నారు. అలాంటివారు అమెరికాలో భాగంగా అక్కడి ప్రజలు ఆమోదించారు. కానీ ట్రంప్ ఆలోచనలు చర్యలు వేరుగా ఉన్నాయి. విదేశీ చొరబాటుదార్లు, నేరగాళ్లు ఆక్రమించినట్లుగా ట్రంప్ ప్రచారం చేసుకుంటున్నాడు. రికార్డుల్లో నమోదు కాని వారితో సహా విదేశాల్లో జన్మించిన కార్మికులు 18.6 శాతం (2.91 కోట్ల మంది) అని 2023 కార్మిక శాఖ వివరాలు తెలిపాయి.అంతకు ముందు ఏడాది 18.1 శాతం ఉన్నారు. వీరిలో 47.6 శాతం మంది మెక్సికో, ఇతర లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చిన వారు కాగా 25.1 శాతం ఆసియా ఖండం నుంచి ఉన్నారు. అధికారికంగా నమోదు కాని వారు 83 లక్షల మంది ఉన్నట్లు, వారిలో మెక్సికో నుంచి 30 శాతం, మధ్య, దక్షిణ అమెరికా దేశాల నుంచి 20, ఆసియా నుంచి 15 శాతం ఉన్నట్లు న్యూయార్క్ వలస అధ్యయన కేంద్రం అంచనా వేసింది. జనాభాలో వలస వచ్చిన వారు 13.8 శాతం, వీరిలో కొందరు వాణిజ్యాలను కూడా ప్రారంభించారు, వారి ద్వారా 2022 ఒక్క ఏడాదే 110 బిలియన్ డాలర్ల రాబడి వచ్చిందని లెక్కలు చెబుతున్నాయి. వీరందరినీ పంపించివేయాలంటే ఏడాదికి 500 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతాయని, రానున్న పది సంవత్సరాలలో కార్మికుల కొరత ఏర్పడుతుందని, జిడిపి 5.1 లక్షల కోట్ల డాలర్లు తగ్గుతుందని తెలుసు.  వలసదారులను బహిష్కరిస్తామని ట్రంప్ వాగ్దానం చేశాడు. మిలిటరీని దించటాన్ని డెమోక్రటిక్ పార్టీకి చెందిన 22 రాష్ట్రాల గవర్నర్లు ఒక ప్రకటనలో ఖండించారు. ట్రంప్ అధికార దుర్వినియోగం, దుర్మార్గమైన, విభజించే చర్య అన్నారు. మెక్సికన్లు లాస్ ఏంజల్స్ నగరంలో నివశించటాన్ని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బామ్ సమర్ధించారు. వారు మంచి వారు, నిజాయితీ పరులు, నేరస్తులు కాదు, తమ కుటుంబాలకు తోడుగా ఉండేందుకు, మెరుగైన జీవితం కోసం వారంతట వారే వెళ్లారని ఆమె అన్నారు. నిరసనకారులు అమెరికా పతాకాలతో పాటు మెక్సికో జాతీయ జెండాలను కూడా ప్రదర్శించారు. వాటిని చూపుతూ చూడండి విదేశీయులు మన దేశాన్ని ఎలా ఆక్రమించుకున్నారో వారిని బయటికి పంపవద్దా అంటూ రెచ్చగొడుతున్నారు. తాము అమెరికాకు వలస వచ్చామని, ఇక్కడే పిల్లలను కని పౌరులమయ్యామని, తమ వారసత్వానికి చిహ్నంగా మెక్సికో పతాకాలను ప్రదర్శిస్తూ దమనకాండకు నిరసన తెలుపుతున్నట్లు– ప్రదర్శకులు సమర్ధించుకుంటున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్నవారిని రెచ్చగొట్టేందుకు ముసుగులు ధరించిన రహస్య పోలీసులను వినియోగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నిరసన కారులు అనుమానం వచ్చి ఎవరని ప్రశ్నిస్తే సమాధానం లేకపోగా బెదిరింపులకు దిగుతున్నారు. తమకు అడ్డుపడితే గవర్నర్, నగర మేయర్లనూ అరెస్టు చేస్తామని ట్రంప్ యంత్రాంగం బెదిరించింది. ఈ దమనకాండకు నిరసనగా అనేక నగరాల్లో ప్రదర్శనలు జరపాలని పిలుపు నిచ్చారు. అనేక మంది స్థానిక అమెరికన్లు వలస వచ్చిన వారు తమ సోదరులే అంటూ మద్దతు తెలుపుతున్నారు. ఒకవైపు ప్రతికూల పన్నులతో ప్రపంచ దేశాల మీద దాడికి దిగిన ట్రంప్ దేశీయంగా వలసలు వచ్చారనే పేరుతో మిలిటరీ దాడులకు దిగాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో ముదురుతున్న సమస్యలకు ప్రతిరూపాలే ఈ దాడులని చెప్పుకోవాలి. ట్రంప్ విధానాలతో ఇప్పుడు అమెరికా ఆర్థికంగా చితికిపోవడం ఖాయమని అంటున్నారు. సుంకాలతో ప్రపంచ దేశాలను రెచ్చగొడుతున్నారు. వలసల పేరుతో దేశంలో అలజడి సృష్టిస్తున్నారు. దీంతో ఓట్లు వేసి గెలిపించిన వారే విమర్శలకు దిగుతున్నారు.

# దళితులపై అక్రమకేసులు దారుణం

### జైలులో ములాఖత్‌లో పరామర్శించిన ఎంపి కొండా


హైదరాబాద్ :  దళితులపై రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ కేసులు నమోదు చేసి  జైళ్లకు తరలించడం అన్యాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధి అత్తాపూర్‌లోని స్థానికులపై పెట్టిన అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించనున్నట్లు– తెలిపారు.  మూడు రోజుల క్రితం జంతు కళేబరాలను వాంబే కాలనీలోని దళిత వాడకు తరలిస్తుండగా కొందరు యువకులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు సుమారు 21 మందిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈక్రమంలో చంచల్‌గూడ జైలులో ఉన్న హిందూ దళిత కార్యకర్తలను కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ములాఖత్ ద్వారా పరామర్శించారు. దళిత వాడలో జంతు వ్యర్థ పదార్థాలను వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించడమే కాకుండా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామన్నారు

# పఠాన్‌కోట్‌లో ఆర్మీ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: పంజాబ్‌లోని పఠాన్‌కోట్ లో భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయింది. నంగల్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాలెడ్ గ్రామంలో శుక్రవారం ఉదయం వాయుసేన హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ అయ్యిందని.. అయితే, ఎటువంటి ప్రమాదం జరగలేదని ప్రాథమిక నివేదికలు తెలిపాయి. పఠాన్‌కోట్ వైమానిక దళ స్టేషన్ నుండి బయలుదేరిన హెలికాప్టర్ సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసర ల్యాండింగ్ అయినట్లు సమాచారం. ముందు జాగ్రత్తగా ఓ ఖాళీ ప్రదేశంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. హెలికాప్టర్ దిగుతున్న దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని గుమిగూడారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

### బిఆర్ఎస్ చేసిన తప్పలను
# మీరూ చేయకండి


### కాంగ్రెస్ ప్రభుత్వానికి కూనంనేని సలహా



సిద్దిపేట : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంపన్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి అప్పుల రాష్ట్రంగా మార్చారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. తెలంగాణలో కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఇంజనీర్స్‌దే పాత్ర ఉందని తమకు ఏం తెలియదని అనడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చలేక కుంగిపోతోందని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని కూనంనేని సాంబశివరావు కోరారు. సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా చాలా అంశాలపై చర్చ జరుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రజలకు హామీలు నెరవేరుస్తామని పార్టీలు మభ్య పెట్టవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రుణమాఫీ పూర్తిగా ఇచ్చినట్లు చెబుతూ చేతులు ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టుల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేంద్రం ప్రభుత్వం పెయిల్ అయిందని విమర్శించారు. మాజీ సీఎం ఈ ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని అన్నారు. ఆర్థికంగా జర్మనీని దాటినట్లు– చెబుతూ కేంద్రం అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతోందని ధ్వజమెత్తారు. అనేక మంది చాలీచాలని జీతాలతో అర్ధాకలితో చాలామంది ఉన్నారని చెప్పారు. విద్య, వైద్యపరంగా మనం 126వ స్థానంలో ఉన్నామని కూనంనేని సాంబశివరావు వివరించారు. ప్రజలను చైతన్యం చేయడంలో సీపీఐ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోందని ఉద్ఘాటించారు. డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలను 5లక్షల మందితో నిర్వహిస్తామని ప్రకటించారు. కేందప్రభుత్వం ఉగ్రవాదులతో చర్చల కోసం సిద్ధంగా ఉన్నది కానీ నక్సలైట్లతో చర్చలకి ఎందుకు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# చింత జీవితాన్ని దహిస్తుంది !

తిరుమల : చిత..చింతలో కేవలం సున్నా మాత్రమే తేడా. కానీ చితి మనిషిని దహనం చేస్తే..చింత జీవితాన్ని దహించేస్తుంది. అందువల్ల చింత కలిగివుంటే అది జీవితాన్ని నిలువెల్లా దహిస్తూనే ఉంటుంది. అందుకే ఏ కార్యమైనా సులువుగా పూర్తి కాదు. కార్యాన్ని పూర్తి చేసేందుకు సంకల్పంతో పాటు ఓపికా, లక్ష్యం కూడా అవసరం. పని కాకున్నా చింతించకుండా దానిని సాధించేందుకు దృష్టి పెట్టాలి. భవితకోసం చేసే ఆలోచనలు, కనే కలలు, అభిలాషలు, లక్ష్యాలు, కార్యాచరణ పథకాలు... వేటినైనా ఈ క్షణం నుంచే అమలుపరచాలి. జ్వరానికి ఔషధం ఈ క్షణం నుంచే తీసుకోవాలి. కూతురి పెళ్ళి చేయాలను కొంటే ఆ శుభకార్యానికి అవసరమైన యత్నాలకు ఈ క్షణమే శుభకరం. ఈ క్షణం ఎలా ఉపయోగించు కొన్నామా అన్నదానిపైనే రాబోయే క్షణాల్లో ఫలితాలు ఉంటాయి. నిన్న అన్నది గతం. రేపు అనేది ఎవరూ ఊహించని రహస్యం. ఈ క్షణాలు ఒక బహుమానం. వాటిని ఆస్వాదించాలి. చింతించడం వల్ల నిన్నటి బాధ తీరదు. ఏమవుతుందోననే దిగులువల్ల రేపు సంభవించే సంఘటనలో మార్పు రాదు. గతానికి, భవితకు వారధి ఈ క్షణం. మన వెనక గతం ఉంది. దానినుంచి నేర్చుకోవాలి. మన ముందు భవిష్యత్తు ఉంది. దానికోసం సిద్ధం కావాలి. కానీ ఈ క్షణం మనది... దానిలో జీవించాలి. క్షణాలు గడిచే కొద్దీ గంట గడచి పోతుంది. గంటలు గడచిపోతే రోజులు గతాలవుతాయి. మనం విశ్రాంతి తీసుకోవలసింది ఎప్పుడంటే... అందుకు బొత్తిగా మనకు సమయం లేనప్పుడే! అందువల్ల కార్యం ఏదైనా వెంటనేచేసే అలవాటు చేసుకోవాలి. వాయిదా పద్ధతి సరికాదు. చింతించం కూడా అంతమంచిదీ కాదు.



ఆధ్యాత్మికం

## బీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షుని నియామకం

### - పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా బండ నిఖిల్ కుమార్ యాదవ్



**(హైదరాబాద్) బ్యూరో: జూన్ 13:** బీసీ ఆజాది ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ నిఖిల్ కుమార్ యాదవ్ ను నియమిస్తూ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జక్కని సంజయ్ మాట్లాడుతూ బీసీ ఆజాది ఫెడరేషన్ చేపట్టబోయే కార్యక్రమాలను పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయడానికి బండ నిఖిల్ కుమార్ యాదవ్ ను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు ప్రకటిస్తున్నామని, పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన బీసీ ఆజాది ఫెడరేషన్ కార్యవర్గాలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా మహనీయుల ఆలోచన విధానంతో, గత ఉద్యమాల అనుభవాలతో పట్టుదలతో నిరంతర కృషితో ముందుకు తాగుదామని, జిల్లా వ్యాప్తంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బండ నిఖిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీల పోరాటంలో ఎంతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్న బీసీ ఆజాది ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జక్కని సంజయ్ కు తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికల భాస్కర్ కు, ప్రధాన కార్యదర్శి కరీం రాజు ముదిరాజు లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'డ్రై - ఫ్రై డే'



**గోదావరి ఖని టౌన్ :** వర్షాకాలంలో అంటువ్యాదులు ప్రబలకుండా నగర పాలక సంస్థ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు .వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం "డ్రై డే ఫ్రై డే " కార్యక్రమం అన్ని వార్డుల్లో నిర్వహించగా లక్ష్మీ పురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ ద్వారా దోమల నిర్మూలన కొరకు, నీరు నిలిచిపోకుండా చూడడం, నిలువ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు ప్రజలు కూడా దోమల లార్వ పెరగకుండా తమ ఇంటి పరిసరాలతో పాటు ఎయిర్ కూలర్లు, పాత టైర్లు, పూల కుండీలు , కొబ్బరి చిప్పలు మొదలైన వాటిలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఈ సంధర్భంగా కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టడంతో పాటు ఎయిర్ కూలర్లు , డ్రమ్ముల్లో నిలువ ఉన్న నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, కుమార స్వామి, కిరణ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , మెప్మా సి ఓ ప్రియ దర్శిని , ఆర్ పి లు , స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పునర్నిర్మించాలి

### - జార్జి రెడ్డి పి డి ఎస్ యు



**గోదావరి ఖని టౌన్ :** శిథిలావస్తలో ఉన్న స్కూల్ హాస్టల్స్ బిల్డింగ్స్ లను కూలగొట్టి నూతన భవనాలను నిర్మించాలని అంగు ఆర్భాటాలతో ప్రారంభించిన నూతన మెనూను పటిష్టంగా అమలు చేయాలని జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎస్ ఇ డి డి వినోద్ కుమార్ కి వినతిపత్రం ఇచ్చిన జార్జి రెడ్డి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న మాట్లాడుతూ నెల పదిహేను రోజులు హాస్టల్స్ కి సెలవలు ఇవ్వడంతో గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచి, బాత్రూం డోర్స్, గదులకు డోర్స్ జాలిలు వేలాడుతున్నాయి అని గత సంవత్సరం ఎలుకులు విద్యార్థులను కొరికిన సందర్భాలు అనేకం ఉన్నాయి అని, వచ్చే సీజన్ వర్ష కాలం కావడంతో ఈగలు దోమలతో విద్యార్థులు సీజనల్ వ్యాధులతో గడపాల్సిన పరిస్తితి ఏర్పడనుంది అని, ప్రారంభం లోనే మౌలిక సదుపాయాలు, అన్ని రకాల రిపేర్లు పూర్తి చేయాలని 5 ఏళ్ల క్రితం ఇచ్చిన బెడ్స్ తుప్పు పడుతున్నాయి అని ,పరుపులు పూర్తిగా పాడైపోయాయి తక్షణమే నూతన పరుపులు, బెడ్స్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్తలో ఉన్న హాస్టల్స్కి నూతన భవనాలను నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం ప్రతినిధిబృందం లో జార్జిరెడ్డి పి డి ఎస్ యు పెద్దపల్లి జిల్లా నాయకులు అనిల్, చారి, మహేష్ రాకేష్ తదితరులు ఉన్నారు.

## నూతన ఎస్ఐని కలిసిన మండల నాయకులు



**గన్నేరువరం, జూన్ 13,:** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి.నరేందర్ రెడ్డిని శు క్రవారం మండలానికి చెందిన నాయకులు బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ పురం శెట్టి బాలయ్య, జక్కన పెల్లి రాజ్ కుమార్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# పోసిన కుప్పలు రాత్రికి రాత్రే రవాణా

- పట్టుకున్నకొద్దీ ఇసుక రవాణా పెరుగుతుంది
- ఎవరి ప్రమేయం అన్నది తెలటం లేదు..?
- ప్రజలపై భారీ మొత్తంలో భారం పడుతుంది





**ధర్మారం, జూన్ 13 :** ఇసుక కుప్పలు పోస్తున్నారు తెల్లవారేసరికి రాత్రికి రాత్రే అక్కడ లేకుండా చేస్తున్నారు. ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు. అయినా ఆగని అక్రమ ఇసుక రవాణా, ధర్మారం మండలంలో విచ్చలవిడిగా ఇదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా జరుగుతుంది. పెద్దపెల్లి నుండి జగిత్యాల వరకు దళారులదే హవా..!! రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని చూస్తున్నప్పటికీ రోజురోజుకు మరింత రవాణా పెరుగుతుంది కానీ తగ్గటం లేదు..? ధర్మారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామ రైతు పొలంలో ట్రాక్టర్ ను పట్టుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మరుసటి రోజే అదే రైతు పొలంలో ఇసుక కుప్పలు మళ్ళీ దర్శనమిచ్చాయి. రాత్రికి రాత్రే ఎత్తుకెళ్లిన వైనం ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నది అనేది తెలియకుండా పోయిందని అధికారులే నివ్వరబోయే పరిస్థితి నెలకొంది నర్సింగాపూర్ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును అధికారులు ముగించుకొని సాయంత్రం తిరిగి మండలానికి వెళుతున్న క్రమంలో పత్తిపాక గ్రామ శివారులో గల బ్రిడ్జి వద్ద మరొక ఇసుక లోడ్ ట్రాక్టర్ ను రెవెన్యూ ఇన్స్పెక్టర్ 1 ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు డిప్యూటీ తహసిల్దార్ మండల ఇన్చార్జ్ తెలిపారు. ఇలా రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారంటే లక్షల రూపాయలు ప్రజల వద్ద దళారులు దోచుకుంటున్నట్టుగా తెలుస్తుంది. ఈ అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రజలపై భారీ మొత్తంలో భారం పడుతున్నది, అందువలన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత అధికారుల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసి అక్రమ రవాణాకు ముగింపు పలకాలని ప్రజలు కోరుతున్నారు.

# మండల మహాసభను జయప్రదం చేయండి

- కార్యకర్తలకు సిపిఐ పార్టీ పిలుపు



**యైటింక్లయిన్ కాలని. :** స్థానిక కత్తుల కొమురయ్య భవన్లో శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు పెద్దపల్లి జిల్లా మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఉదయం జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం పార్టీ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతమ్ గోవర్ధన్ మాట్లాడుతూ..ఈనెల 17న 8వ కాలనీలో కమాన్ పూర్ మండల మహాసభ జరుగుతుందని, ఈ మహాసభలో మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1925 లో ఆవిర్భవించి, నాటి నుండి నేటి వరకు వంద సంవత్సరాలు గడిచిందన్నారు. నాటినుండి నేటివరకు ప్రజల, కార్మికుల హక్కుల సాధన కొరకు అనేక ఉద్యమాలను నిర్వహిం చిందన్నారు. ఇక సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, దేశ వ్యాప్తంగా మహాసభలు నిర్వహించి, నూతన నాయకత్వాన్ని ఎన్నుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేపట్టేందుకు పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందని తెలిపారు. ఆమెరకే ఆగస్టు నెలలో సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభలు, జూన్ నెలలో పెద్దపల్లి జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో మండల మహా సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే 17న కాలనీలో కమాన్ పూర్ మండల మహాసభ నిర్వహించడం జరుగుతుందని,ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తో పాటు ఏఐటియుసి, సిపిఐ నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ, ఏఐటియుసి ప్రజా సంఘాల నాయకులు ఎల్. ప్రకాష్, కందుకూరి రాజారత్నం, జీగురు రవిందర్, బి. అన్నారావు, బుర్ర తిరుపతి, బి.శాంసన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బకాయిలపై నోరు మెదపని సంఘాలు

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజిరెడ్డి



**యైటింక్లయిన్ కాలని. :** తమ హాయంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, న్యాయంగా అమలు కావలసిన అనేక హక్కులను సాధించి పెట్టామని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం సింగరేణి రామగుండం రెండవ డివిజన్ వకీల్ పల్లె గనిపై, సంఘం రెండవ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కార్మిక వర్గానికి 16% నుండి 32% లాభాల వాటా పెంపుకు, కారుణ్య నియామకాల ద్వారా 16,000 మందికి ఉద్యోగాలు ఇప్పించడం, ఎక్స్టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 4,000 పై చిలుకు ఉద్యోగాలు కల్పించడం, 1% విద్యుత్ చార్జీల రద్దు, ఏసీలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇప్పించడం, ఇలా 70కి పైగా హక్కులను సాధించి పెట్టమన్నారు. అలాగే కోల్ ఇండియాలో లేని 18 హక్కులను కూడా సింగరేణిలో అమలు చేయించిన ఘనత తమ సంఘానిదేనన్నారు. గుర్తింపు సంఘం నాయకత్వంలో 18 నెలల కాలంగా ఏ ఒక్క కార్మిక సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆరోపించారు. పెర్క్స్ పై ఐటి మినహాయింపు, ప్రతీ కార్మికునికి 250 గజాల ఇంటి స్థలం కేటాయింపు, 30 లక్షల రూపాయల వడ్డీ లేని రుణ సదుపాయంపై మాట్లాడే వారే కరువయ్యారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే నాటికే సింగరేణికి 5800 కోట్ల బకాయిలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రంలో థర్మల్ పవర్ ప్లాంట్, బొగ్గు అమ్మకాల ద్వారా మొత్తంగా 25 వేల కోట్లు బకాయిలు ఉంటే ప్రతీ రోజు గనులపై అల్లరి చేసే జాతీయ కార్మిక సంఘాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 13 వేలకు పైగా కోట్ల రూపాయలు అదనంగా మొత్తంగా 38 వేల కోట్ల రూపాయలకు సింగరేణికి బకాయిలు వేరుకపోయి ఉన్నాయని ఆరోపించారు. సింగరేణి బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలని బిఆర్ఎస్, టీబీజీకేఎస్ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాయని, కానీ ఇప్పుడున్న సంఘాలు వేలంలో పాల్గొంటాం అనడం, తద్వారా ప్రైవేట్ వారికి లబ్ధి చేకూర్చే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మిక సమస్యల పరిష్కారం కొరకు దశల వారి ఆందోళనకు సిద్ధమవుతుందని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో నాయకులు చెరుకు ప్రభాకర్ రెడ్డి, ఐ. సత్యం, అబ్బ శ్రీనివాసరెడ్డి, వెంకటేష్, రవితేజ, శ్రీనివాస్, ఆవుల రాములు, సిరి శెట్టి రాములు, కాసిం, మోహన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గ ఐక్యతతోనే కులనిర్మూలన

- దేశ సమైక్యతను దెబ్బతీస్తున్న మోడీ విధానాలు
- రాజ్యాంగ రక్షణకు అట్టడుగు వర్గాలు ఐక్యం కావాలి
- కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు



**పెద్దపల్లి ప్రతినిధి :** మార్క్స్ పూలే అంబేద్కర్ స్ఫూర్తితో శ్రామిక వర్గఐక్యతను సాధించాలని తద్వారా కుల నిర్మూలన జరుగుతుందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అన్నారు శు క్రవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కెవిపిఎస్ కార్యాలయంలో పెద్దపల్లి, ఆసిఫాబాద్ ,మంచిర్యాల, జిల్లాల నాయకులకు రెండు రోజుల సామాజిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు అనంతరం కులసమస్య వర్గదృక్పదం అనే అంశంపై క్లాసు బోధించాగా కెవిపిఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు మొదటి రోజు శిక్షణ తరగతులకు ప్రారంభసూచకంగా కెవిపిఎస్ జెండాను పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు మొదుంపెల్లి శ్రవణ్ ఆవిష్కరించారు. అనంతరం తరగతుల నుద్దేశించి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడారు. మోడీ పాలనలో దేశంలో సామాజిక న్యాయంపై ప్రభుత్వ రంగ సంస్థలపై తీవ్రమైన దాడులు కొన సాగిస్తోందన్నారు. దళిత జనాభా ప్రకారం సబ్ ప్లాన్ నిధులను కేంద్ర బడ్జెట్ లో కేటాయించకుండా మోసం చేస్తుందన్నారు.ఎస్సీ ,ఎస్టీ రిజర్వేషన్లు పై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ధ్వాడిచేస్తుందని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పజెప్పుతుందన్నారు. ప్రైవేట్ రంగ సంస్థలలో రిజర్వేషన్ లు అమలు చేయకపోవడంతో రాజ్యాంగ హక్కులను దళితులు , బలహీన వర్గాలు పొందాలేక పోతున్నారని అన్నారు.బిజెపి పాలనలో ప్రతి రోజు ఆరుగురు దళిత మహిళలు అత్యాచారానికి గురువుతున్నారని అన్నారు వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దళితులపై అత్యధికంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. మోడీ మనువాద విధానాలపై రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం సమరశీల పోరాటాలు కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయల అంబేద్కర్ అభయ హస్తం ప్రకటించి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ షరతులను పెట్టి రాజీవ్ వికాస్ పథకానికి అనర్హులుగా ప్రకటిస్తే లబ్ధిదారులతో కెవిపిఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని తెలిపారు.కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూలి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీలకు 25 శాతం ఉచిత ప్రవేశాన్ని కల్పించే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కలెపెల్లి అశోక్ , మొదుంపల్లి శ్రావణ్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్కే మోహన్ లక్ష్మి, నవీన్, ప్రకాష్, సూరజ్ ,రాజు,అభి,మోహన్, సంజయ్, రిన,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- శాంతి భద్రతల నిర్వహణ చాలా కీలక అంశం
- భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- ఎలిగేడు మండలానికి నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి
- ఎలిగేడు మండలంలో నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి







**పెద్దపల్లి ప్రతినిధి :** గత పాలకులు నాశనం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ అదే సమయంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుదిల్ల శ్రీధర్ బాబు, కరీంనగర్ సుధా చైర్మన్ కే నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు లతో కలిసి ఎలిగేడు మండలంలో నూతన పోలీస్ స్టేషన్ ను ప్రారంభించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కృషిచేసిన నాయకులు ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే ఇక్కడ పోలీస్ స్టేషన్ వచ్చిందని అన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ వారి కష్టాల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేసే నాయకుడు పెద్దపల్లి ఎమ్మెల్యే గా ఉన్నారని మంత్రి అభినందించారు. ఎన్నికల సమయంలో కొంతమంది నాయకులు అకస్మాత్తుగా ప్రజలలోకి వస్తారని, ఓడిపోయిన గెలిచిన తర్వాత కనిపించరని, పెద్దపల్లి ఎమ్మెల్యే మాత్రం ఓడిపోయిన సమయంలో కూడా పూర్తిస్థాయిలో ప్రజలలో ఉన్నారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా ప్రజలలో ఉంటూ పని చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత పాలకులు విచిన్నం చేసినప్పటికీ ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. గత పాలకుల సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ అదనంగా నూతనంగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. గత పాలకులు తీసుకుని వచ్చిన ధరణి చట్టం వల్ల కేవలం పాలకుల కుటుంబ సభ్యులు మాత్రమే లబ్ధి పొందారని, అనేక మంది రైతులకు కన్నీళ్లు మిగిల్చిన ధరణి చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి భూ సమస్యల పరిష్కారానికి అద్భుతమైన భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి అధికారులు వచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, ప్రజల నుంచి భూ సమస్యల గురించి దరఖాస్తులు తీసుకొని క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరిస్తారని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం, గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంపు, పేదలకు సన్న బియ్యం పంపిణీ, 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందుతుందని, రాబోయే 4 సంవత్సరాల కాలంలో సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను కట్టాలని ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు :** మండలం ఏర్పాటు చేసిన 24 సంవత్సరాల తర్వాత స్థానిక ఎమ్మెల్యే కృషి ఫలితంగా నేడు పోలీస్ స్టేషన్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు అత్యాధునిక సదుపాయాలతో ఎలిగేడు మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. సామాన్య ప్రజలకు కష్టాలను పరిష్కరించే దిశగా పోలీస్ అధికారులు నేడు విధులు నిర్వహిస్తున్నారని, గ్రామ స్థాయి నుంచి పక్కాగా శాంతి భద్రతలు నిర్వహించేలా పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని మంత్రి తెలిపారు. పోలీస్ స్టేషన్ కు చాలా తక్కువ మంది రావాలని, ప్రజలు శాంతియుతంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వం ఎక్కడ ఆసుపత్రులను నిర్మించినా కూడా ప్రారంభోత్సవ సమయంలో ప్రాంత ప్రజలకు తక్కువ రోగాలు రావాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన చికిత్స అందాలని కోరుకుంటామని అదే విధంగా పోలీస్ స్టేషన్ కు రావాల్సిన పరిస్థితి ఎవరికి రావద్దని, తమ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలను సొంత చుట్టాలు వస్తే ఏ విధంగా పరిష్కరిస్తామో ఆ విధంగా పోలీస్ సిబ్బంది పరిష్కరించాలని మంత్రి సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలిగేడు మండలానికి అత్యధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. నిరుపేదలను స్పష్టంగా గుర్తించి వారికి సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలను వసతులను ప్రజా ప్రభుత్వం మెరుగుపర్చిందని, లిమన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సతీమణి ఇటీవల గోదావరిఖని జనరల్ ఆసుపత్రి లో ప్రసవించిందనిలి ప్రభుత్వ ఆసుపత్రి ను ఉపయోగించే ప్రజలలో భరోసా కల్పించినందుకు మంత్రి జిల్లా కలెక్టర్ ను అభినందించారు.

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు :** ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 57వ మండలంగా 2001 సంవత్సరంలో ఎలిగేడు ఏర్పాటు కావడం జరిగిందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎలిగేడు పోలీస్ స్టేషన్ హామి గత పాలకులు నిర్లక్ష్యం చేసిందని, ప్రజా పాలన వచ్చిన తర్వాత శ్రీధర్ బాబు నాయకత్వంలో ముఖ్యమంత్రి ఒప్పించి నేడు ఎలిగేడు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మండల ఆఫీసు, తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ప్రజా పాలనలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలిగేడు మండల ప్రజల కోసం రాబోయే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

**రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ :** రామగుండం కమిషనరేట్ పరిధిలో నాలుగు నూతన పోలీస్ స్టేషన్ లను ఒకే రోజు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే మంత్రి వర్యుల కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని అన్నారు. ఎలిగేడు మండలంలో 12 గ్రామ పంచాయతీల పరిధిలో గల 20వేల జనాభాకు ఉపయోగపడేలా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని, 20 కిలోమీటర్ల ఏరియా పరిధిలో పోలీస్ స్టేషన్ నడిపించుకు నేందుకు అవసరమైన పోలీస్ సిబ్బంది ఎస్ఐ సిఐలను కేటాయించామని అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలను ఎలా రిసీవ్ చేసుకోవాలి అనే దానిపై సంపూర్ణ శిక్షణ సిబ్బందికి అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ , ప్రజా ప్రతినిదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేసిన పోలీసులు




**యైటింక్లయిన్ కాలనీ. :** గోదావరిఖని రెండవ పట్టణ పోలీసులు గురువారం రాత్రి పోతన కాలనీ స్థానికులతో రోడ్డు భద్రత డివిజన్ కమిటీని ఏర్పాటు చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝు. (డిఐజి) ఆదేశం మేరకు రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించిన సీఐ ఎన్. ప్రసాద్ రావు పెద్దపల్లి డిసిపి పి. కరుణాకర్, గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ రావు స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. రోడ్డుపై వాహనదారులు వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని అన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అలాగే వాహన డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలని, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నప్పుడు డాక్యుమెంట్లను బాధ్యతగా చూపించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపరాదని, ప్రతి ఒక్కరు వాహనాన్ని నడుపుతున్నప్పుడు తన గమ్యస్థానం చేరేవరకు జాగ్రత్తగా తమ భార్య పిల్లలను, ఎదుటివారిని దృష్టిలో పెట్టుకుని నడపాలని హితువు పలికారు. ఇక మైనర్లకు వాహనం ఇవ్వరాదని, అలా ఇచ్చినట్లయితే వాహన యజమానిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గమ్యం చేరడానికి వేగంగా నడుపుతూ, రోడ్డు ప్రమాదాలకు గురవుతూ, తమ అమూల్యమైన జీవితాలను కోల్పోయి, భార్య పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న వారవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన వ్యక్తి 108 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అలాగే 100 కు డయల్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే సహాయం చేయడం కొరకు ఈ రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఇంకా ఈ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, రాజకుమార్, వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

## సింగరేణి స్కూల్‌ను సందర్శించిన జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్)



**గోదావరిఖని ప్రతినిధి :** సింగరేణి ఎడ్యుకేషనల్ సెక్రటరీ, జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) గుండా శ్రీనివాస్ శుక్రవారం రోజు సింగరేణి హైస్కూల్ సెక్టార్-2, పాఠశాలను సందర్శించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి పదవతరగతిలో మంచి మార్కులు సాధించినందుకులకు అభినందించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి వారి యొక్క సమస్యలను స్కూల్ కు కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి పాఠశాలల ప్రగతి కోసం సంస్థ సి అండ్ ఎండీ ఎన్.బలరాం చేస్తున్న కృషిని అభినందించారు. సింగరేణి పాఠశాలల చరిత్రలో వారి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందంటూ. ఈ విషయాన్ని తన హృదయపు లోతుల్లో నుండి చెపుతున్నానంటూ కొనియాడారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కరస్పాండెంట్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సర మంచి ఫలితాలు సాధించాలని దానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కుడా ఒక లక్ష్యం పెట్టుకొని లక్ష్య సాధనకోసం అహర్నిశలు కష్ట పడాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సంతోష్ సి.సి.సి పాఠశాలలో అందించిన సేవలకు గానూ వారిని అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## 43 మైళ్ళ దూరాన విడిచినా..... ఇళ్ళు చేరిన శునకం



**మానకొండూర్, జూన్ 13, :** 43 మైళ్ళ దూరానా విడిచిపెట్టినా యజమాని మీద మమకారం పోలేదేమో ఆ శునకానికి, ఏకంగా 5రోజులకు తిరిగి ఇళ్ళు చేరుకున్న శునకాన్ని చూసి యజమాని కుటుంబం, ఇంటి చుట్టుపక్కల వాళ్ళు ఆశ్చర్యానికి గురయ్యారు. వివరాళ్ళోకి వెళితే..... కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన పున్నం మల్లయ్య 6 సంవత్సరాల క్రితం తన ఇంటి వెనకాలే ఒంటరిగా తిరుగుతున్న ఓ శునక పిల్లను గమనించి దానికి రోజు పాలు,మూడు పూటలా అన్నం పెడుతూ పెంచుతుండడంతో ఇంట్లో ఓ వ్యక్తిలా మారింది. అలా ఆ శునకం పెరిగి పెద్దదై మల్లయ్య ఊళ్ళో ఎక్కడికెళ్లినా వెంట వెళ్తూ వచ్చేది. ఇంటికి ఎవరు రాకుండా కాపలా కాస్తున్న ఆ శునకం ఈమద్య ఇంటికి వచ్చే వారిపై దాడి చేస్తుండగా మీ శూనకం వల్ల ఇబ్బంది పడుతున్నామని దాన్ని ఎక్కడైనా దూరంగా విడిచిపెట్టాలంటూ వీధిలో ఉన్నవాళ్ళు మల్లయ్యను సూచించారు. దీంతో శునకాన్ని విడిచి పెట్టడం ఇష్టం లేకపోయినా ఈనెల 7వ తేదీన శూనకాన్ని బైక్ పై తీసుకెళ్తే దారి గుర్తుపట్టి మళ్ళీ వస్తుందేమోనని ఆలోచించిన మల్లయ్య కారులో తీసుకెళ్ళి ఊరికి 43మైళ్ళ (70 కిలోమీటర్లు) దూరంలో ఓ అడవి ప్రాంతంలో విడిచిపెట్టారు మల్లయ్య కుటుంబ సభ్యులు. శూనకాన్ని విడిచిపెట్టడం ఇష్టం లేకపోయినా, బలవంతంగా దాన్ని కారులో నుండి దింపేయగా నన్ను విడిచి వెళ్తున్నారని ఊహించని ఆ శునకం కారు కాస్త ముందుకు వెళ్ళగానే బిత్తర చూపులు చూసి, కొద్దిసేపటి తర్వాత పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్ళిపోయింది. శునకాన్ని వదిలేసామనే బాధతో ఇంటికి వచ్చిన ఐదు రోజులకు జూన్ 12వ తేదీన సాయింత్రం శునకం తిరిగి మల్లయ్య ఇంటికి చేరుకోవడంతో ఒక్కసారిగా మల్లయ్య కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్ళు ఆశ్చర్యానికి లోనయ్యారు. 70 కిలోమీటర్ల దూరంలో రోడ్డు కనిపించకుండా తీసుకెళ్ళి ఓ అటవీ ప్రాంతంలో విడిచి పెట్టిన శూనకం మళ్ళీ ఇంటికి చేరడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. యజమానిపై విశ్వాసం, యజమాని కుటుంబంపై మమకారంతో శూనకం తిరిగి ఇళ్లు చేరిందని కొందరు అంటుండగా శూనకాలకు మనుషులకంటే ఎక్కువ జ్ఞాపక శక్తి ఉంటుందని దానివల్లే అది మళ్ళీ ఇంటికి వచ్చిందంటూ మరికొందరు అనుకుంటున్నారు. ఏది ఏమైనా తన యజమాని దగ్గరికి చేరడానికి ఆ శూనకం 5 రోజులు ప్రయాణం కొనసాగించడం చాలా విశేషమంటున్నారు స్థానికులు. ఇంటికి వచ్చే వాళ్ళు ఇబ్బంది పడుతున్నారనే కారణంతో ఇష్టం లేకున్నా శూనకాన్ని వదిలిపెట్టామనే బాధలో ఉన్న సమయంలో శూనకం వారింటికి రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు యజమాని పున్నం మల్లయ్య కుటుంబం.

## కొండపల్కలలో బడిబాట కార్యక్రమం...!



**మానకొండూర్, జూన్ 13,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కలలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్షపతి ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ విద్య కమిటీ చైర్మన్ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నల్గొండ తిరుపతి గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు,గ్రామ వైద్యులు, ఆశా వర్కర్లు, మహిళా సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు అమలు చెయ్యాలి

## - సింగరేణికి "ఇఫ్టు" డిమాండ్



**యైటింక్లయిన్ కాలనీ. :** కాలనీలో శుక్రవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో ద్వారా సమావేశం జరిగింది. ఉదయం 3వ జోన్ లో జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు బి.అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని స్తానిక కాంట్రాక్ట్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాలలో 30 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, అయితే వారికి ఫ్యాక్టరీ యాక్ట్ పూర్తిస్థాయిలో పరిశ్రమల చట్టబద్ధంగా హక్కులు, సౌకర్యాలు అమలు కాకపోవడం వల్ల శారీరకంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని ఆరోపించారు. వీరి హక్కులు సౌకర్యాలు అమలు చేయడంలో సింగరేణి యాజమాన్ యం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంట్రాక్టు కార్మిక వర్గంపై దృష్టి సారించి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అలాగే కోల్ ఇండియాలో జనవరి 2013 నుండి హైపర్ కమిటీ వేతనాలు అమలుకు ఆదేశాలు ఇచ్చింది, అలాగే సింగరేణిలో కూడా అమలు చేసేందుకు యాజమాన్యం తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్టిపిసి పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ అమలవుతున్న సర్వీస్ పే లీవులు, పండుగ మస్టర్లు, క్యాంటీన్ అలవెన్స్, ట్రావెలింగ్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్ లాంటివి సింగరేణిలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కార్మికునికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం ఇన్ పేషెంట్ గా కల్పించాలని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా సింగరేణిలో ఒకే రకమైన వేతనాలు అమలు చేయాలని, నర్సరీ కార్మికులు, సులాబ్ కార్మికులను వేరుగా చూడొద్దని, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల 7వ తేదీన వేతనాలు చెల్లించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల మండల స్థాయి ఎంపిక పోటీలు

**మానకొండూర్, జూన్ 13,:** తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో రాష్ట్ర ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2025 -26 విద్యా సంవత్సరానికి గాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ. మధుసూదనాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.హకీంపేట్, కరీంనగర్, అదిలాబాదులో ఉన్న క్రీడా పాఠశాలలకు నిర్వహించే మూడు అంచెల ఎంపిక విధానంలో భాగంగా ఈనెల 17, 18 తేదీలలో మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీలు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరుగునని, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు జూన్ 23 నుండి 26 వరకు జిల్లా స్థాయిలో అందులో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుండి 5వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపిక జరుగుతుందని తెలిపారు. హకీంపేటలో బాలురులకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, కరీంనగర్ లో బాలురులకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు, అదిలాబాదులో బాలురకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు మొత్తం 120 సీట్ల భర్తీ కోసం ఎంపిక జరుగుతుందని మొత్తం తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నాల్గవ తరగతి ప్రవేశాల కోసం 2016 సెప్టెంబర్ 1 నుండి 30-8- 2017 ఆగస్టు 31మధ్య జన్మించి ఉండి పోటీలకు అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 15తేది లోపు తమ చరవాణి నుండి కానీ, లేదా తమ వివరాలు నమోదు చేసుకోనవచ్చుని తెలిపారు.పూర్తి సమాచారం కొరకు ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను కూడా రూపొందించి విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉంచామని, పరీక్షలు నిర్వహించే తేదీ, ప్రాంతాలు ఇతర వివారాలకు సంబంధించిన మరిన్ని వివరాలకోసం 9849463584 నెంబర్ ద్వారా కన్వీనర్ పి.డి ఆర్ నర్సయ్యను సంప్రదించాలని సూచిస్తూ ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఉండేవిధంగా అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు ఎంఈఓ మధుసూదనాచారి ప్రకటనలో తెలిపారు.

## రాచపల్లి పాఠశాలలో బడిబాట



**ఇల్లందకుంట జూన్ 13 :** రాచపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి గారి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగినది.గ్రామంలో ఉన్నటువంటి ఇంటింటికి విద్యార్థుల మరియు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారి పిల్లలను బడిలో చేర్పించాలని కోరడమైనది. ఇల్లందకుంట మండల విద్యాధికారి కే. రాములు మాట్లాడుతూ మన గ్రామం రాచపల్లిలో పాఠశాల ప్రారంభమైనదని మీ పిల్లలందరినీ మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులు ఉన్నారని మరియు విద్యార్థులకు ఉచిత దుస్తులు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనము, డిజిటల్ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు పైన విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారని అలాగే మన పాఠశాలలో కంప్యూటర్ విద్య, బాలికలకు ఆత్మ రక్షణకై కరాటే శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విద్యార్థులు అందరికీ మెరుగైన విద్యను అందిస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ,నాణ్యమైనటువంటి మధ్యాహ్న భోజనము, యూనిఫామ్, నోట్ బుక్స్ ఇస్తున్నామని తెలియజేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి మాట్లాడుతూ మా పాఠశాలలో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు చాలా చక్కటి విద్యను అందిస్తున్నామని శిక్షణ పొందిన మరియు అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులచే బోధన అందిస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని మా పాఠశాలలో సైన్స్ ల్యాబ్ కంప్యూటర్ ల్యాబ్, అధినాతనమైనటువంటి డిజిటల్ బోర్డ్స్ ఉన్నాయని కావున గ్రామంలోని ప్రతి విద్యార్థిని రాచపల్లి పాఠశాలలోని చేర్పించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కే. రాములు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె రామిరెడ్డి, మరియు ఉపాధ్యాయులు వేణుగోపాల చారి, రమాదేవి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి......!



**తిమ్మాపూర్, జూన్ 13,:** విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మండలకేంద్రానికి చెందిన న్యాలం హరీష్ (35) అనే వ్యక్తి తన ఇంటి ముందున్న నీటి సంపులో నీటిని తోడుచుండగా పక్కనే ఉన్న విద్యుత్ మోటారుకున్న వైరు తెగి ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై హరీష్ కింద పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హరీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని మృతుడి భార్య న్యాలం దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

# మహిళల ఆరోగ్యమే.. ఇంటి ఆరోగ్యం..

## • మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్









**జమ్మికుంట జూన్ 13 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సి.డి.ఎం.ఎ ఆదేశాల మేరకు 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మహిళలకు, పారిశుద్య కార్మికులకు ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డి.ఎం అండ్ హెచ్ వో చందు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, మెప్మా జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీవాణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ హెల్త్ క్యాంపులో ప్రతి మహిళ, పారిశుద్య కార్మికులు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ వైద్య పరీక్షలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్యాంపు ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద పెద్ద పట్టణంలోని ఆసుపత్రిలో వేలాది రూపాయలు వెచ్చించి ఓపికగా ఉంటారు. అదేవిధంగా ఈ ప్రత్యేక హెల్త్ క్యాంపులో ప్రతి ఒక్కరు ఓపికగా ఉండి వైద్య పరీక్షలు నిర్వహించి ముందుకు తీసుకొని వెళ్ళాలన్నారు. మన ఆరోగ్యం మన ఓపిక అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటి డి.ఎం. అండ్ హెచ్ వో చందు మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళలను దృష్టిలో పెట్టుకొని మహిళా వైద్యులతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించి వ్యాధిని అరికట్టాలన్నారు. ఈ వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరు పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మహిళలో అధిక మరణాలు రొమ్ము క్యాన్సర్, ఎముకల క్యాన్సర్ లతో సంభవిస్తున్నాయన్నారు. వాటిని ముందుగా పరీక్షలు నిర్వహించి, చిన్న గాయం ఉన్న పరీక్షలు నిర్వహించుకుని, వచ్చే వ్యాధులను అరికట్టాలన్నారు. వైద్యులకు ఎటువంటి మొహమాటం లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మహిళల ఆరోగ్యం ఇంటికి రక్షణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన, వైద్యులు హిమబిందు, మహోన్నత పటేల్, కంటి వైద్యులు జలధర్, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, హెల్త్ సూపర్ వైజర్ రచన, అరుణల, మెప్మా సి.ఎల్ అర్పిలు మంజుల, జ్యోతి, ఏ. ఎన్ఏం లు రజిత, మంజుల, రాధ, సాజిద, కవిత మెప్మా అర్పిలు, సంఘ సభ్యులు, పారిశుద్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

# ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మిక తనికి చేసిన ఆర్.జి 1 జిఎం



**గోదావరిఖని ప్రతినిధి :** ఆర్.జి 1 ఏరియా జిఎం లలిత్ కుమార్ ఏరియా హాస్పిటల్ ఆకస్మిక తనికి చేయటం జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ లో మందుల స్టోరేజ్ యొక్క స్థితి పేషెంట్ లకు అందిస్తున్న మందుల యొక్క వివరాలను నేరుగా ఫార్మసి కౌంటర్ వద్ద ఉద్యోగులను అందుతున్న మెడిసిన్ వివరాలను నేరుగా అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిఎం తెలియజేస్తూ రామగుండం ఏరియా 1 లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ ప్రతిరోజు ఉద్యోగులు రిటైర్ అయిన ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తుంది. ప్రతిరోజు దాదాపుగా ఏరియా హాస్పిటల్ డిస్పెన్సరీలు కలుపుకొని 2500 మందికి ఓపి సేవలు అందించబడుతున్నాయి. ఉద్యోగుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఏరియా హాస్పిటల్ లో వైద్య సేవలు కార్పొరేట్ హాస్పిటల్స్ లో రిఫరల్ పంపించి కంపెనీ యాజమాన్యం అన్ని విధాల తోడ్పడుతుంది. ఉద్యోగులకు 700 రకాల మందులు మన ఏరియా హాస్పిటల్ లో అందుబాటులో ప్రతి సంవత్సరం ఉంటాయి. ఏప్రిల్ 2025 నుండి ఈ గత రెండు నెలల్లో దాదాపుగా 15 లక్షల ఖర్చు పెట్టి మన దగ్గర అందుబాటులో లేని మందులు కూడా లోకల్ పర్చేస్ ద్వారా తెప్పించి ఉద్యోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోబడ్డాయి ప్రస్తుతానికి 700 రకాల మందులలో 525 రకాల మందులు మన ఏరియా హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయి మిగతా 175 రకాల మందులు ఈ నెల ఆఖరుకు అందుబాటులోకి వచ్చేస్తాయి గడిచిన ఆరు నెలలలో మన రామగుండం ఏరియా హాస్పిటల్ లో దాదాపుగా కోటి 50 లక్షలు వ్యయంతో మందులు ఉద్యోగులకు సరఫరా చేయబడ్డాయి. ప్రతి రెండు సంవత్సరాలకు టెండర్ ల ప్రక్రియ ద్వారా మందుల కంపెనీలు మారుతుంటాయి కావున ఉద్యోగి కి అవసరం ఉన్న మందులు అదే మెడిసిన్ కానీ, వేరే వేరే కంపెనీలో ఇవ్వడం జరుగుతుంది. మందులకోసం హాస్పటల్ కు వచ్చు ఉద్యోగులు, పేషెంట్ లు ఎలాంటి అపోహలకు పోవద్దని సింగరేణి కంపెని ఎల్లప్పుడూ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటు పడుతుందని, కార్మికుల కోసం అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలని చేపడుతుందని ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. ఇట్టి విషయమై ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు కంపెనీకి సహకరించగలరని జిఎం విజ్ఞప్తి చేశారు. జిఎం తో పాటు డివైసిఎంఓ డాక్టర్ అంబిక, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ వీరా రెడ్డి ఏరియా హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బలోపేతం అవుతున్న కేటీఆర్ సేన

## - పెద్దపల్లి జిల్లా కేటీఆర్ సేన ప్రధాన కార్యదర్శిగా సురేష్ గౌడ్ నియామకం



**(హైదరాబాద్ ) బ్యూరో: జూన్ 13** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో కేటీఆర్ సేన ఏర్పాటుచేసిన సమావేశంలో పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన చర్లపల్లి సురేష్ గౌడ్ ను నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన కేటీఆర్ సేనను బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. అనంతరం సురేష్ గౌడ్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ కు,రాష్ట్ర అధ్యక్షుడు మింగాని మనోహర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మోసపూరిత కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ బి ఆర్ఎస్ కు పూర్వవైభవాన్ని తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రౌతు జలపతి, ఉప సర్పంచ్ కోమల్ రెడ్డి, సీనియర్ నాయకులు రమణారెడ్డి బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మరెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ పౌడర్ ప్యాకెట్ల పంపిణీ



**ముత్తారం.జూన్.13.:** ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్హెచ్పి దీప్తి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ పౌడర్ ప్యాకెట్లను మాజీ సర్పంచ్ సతీష్ పంపిణీ చేశారు. జింక్ రోగనిరోధక శక్తిని పెంచేందుకు సహాయ పడుతుందని, పిల్లల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుందని దీనిని నీటిలో కరిగించి తాగాలని ఎంఎల్హెచ్పి దీప్తి సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీష్, సిబ్బంది పుష్పలత, కళావతి, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**తొర్రూరు, :** భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ జి.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండలంలోని మడిపల్లి, పోలేపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. స్వయంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించిన తరువాత వారికి రశీదు ఇవ్వాలని సూచించారు. భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో దరఖాస్తులను స్వీకరించామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నర్సయ్య, మడిపల్లి మాజీ సర్పంచ్ వేల్పుల అంజలి ఐలయ్య, మాజీ ఉపసర్పంచ్ నలుగురు రామలింగం,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ◆ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**తొర్రూరు, :** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సిఆర్ఆర్ఎస్పిపి నిధుల నుండి ఫత్తెపురంకు రూ.10 లక్షలు, చర్లపాలెంకు రూ. 12 లక్షలు, గోపాలగిరి రూ.5 లక్షలు, హరిపిరాలకు రూ.19.50 లక్షలు, కర్కాలకు రూ.7 లక్షలు మంజూరు కావడంతో శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తో కలిసి సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకతీతంగా గ్రామాలను అభి వృద్ధిపరచనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేసి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగు, సాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు హామీ నిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరు అధైర్య పడవద్దని,ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. పేదలకు సన్న బియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు సైతం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీనివాస రావు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుల్లారావు, ఎంపీఓ అప్సర్ పాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు,గంజి విజయపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,ఏఎంసి డైరెక్టర్ అచ్చిరెడ్డి,నాయకులు చాపల బాపురెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, మంగళపల్లి రామచంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి,అనుమాండ్ల దేవేందర్ రెడ్డి,పేరటి యాకుబ్ రెడ్డి,అశోక్ రెడ్డి,పింగిలి ఉష,జాటోత్ రవి నాయక్, నల్లమాస సమ్మయ్య గౌడ్, మెరుగు మల్లేశం, తూనం శ్రావణ్, రాజేష్ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్,నాగిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వల్లపు మల్లయ్య, మహేష్ యాదవ్, మహేందర్, హరీష్, కిషన్ రెడ్డి, ఎర్ర వెంకటరెడ్డి, తోట అశోక్, అన్వేష్, రోహిన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## 4 కోట్ల 20 లక్షల రూపాయలతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు








**పెద్దపల్లి ప్రతినిధి :** శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో పర్యటించిన రాష్ట్ర హౌసింగ్ రెవెన్యూ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు 4 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మించే సమీకృత మార్కెట్ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎలిగేడు మండలంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ ను మంత్రులు ప్రారంభించారు. పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్ లను మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సుధా చైర్మన్ కే నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ , ప్రజా ప్రతినిదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హవల్దార్ ఆరిఫ్‌కు ఎమ్మెల్సీ అభినందన

**- రూ. 25 వేలు సహాయం అందించిన ఎమ్మెల్సీ కొమురయ్య**



**పెద్దపల్లి ప్రతినిధి :** ఆపరేషన్ సింధూర్ లో దేశం తరుపున అమోఘమైన సేవలు అందించిన పెద్దపల్లి వాసి భారత సేనలో హవల్దార్ గా పని చేస్తున్న మహమ్మద్ ఆరీఫ్ ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య గురువారం రాత్రి ఆరీఫ్ ను పెద్దపల్లి బీజేపీ కార్యాలయంలో కలిసి అభినందించారు. ఆపరేషన్ సింధూర్ లో ఆయన చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. శాలువాతో సత్కరించి అభినందించారు. ఆరీఫ్ సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ మల్క కొమురయ్య రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం దేశ రక్షణలో ఆయన చేసిన సేవలకు గౌరవ సూచకంగా, కృతజ్ఞతాభి వ్యక్తిగా అందజేసినట్లు ఎమ్మెల్సీ కొమురయ్య తెలిపారు. దేశం కోసం పోరాడే సైనికుల సేవలను ప్రతీ పౌరుడు కీర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డి, నాయకులు రాంసింగ్, కావేటి రాజగోపాల్, ఫహీం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోండి



**రామగిరి, జూన్ 13:** ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బాలికల పాఠశాల ప్రధానో పాధ్యయురాలు సుమలత అన్నారు. శుక్రవారం అదే పాఠశాలలో పని చేస్తున్న దొంతుల కుమార్ అనే ఉపాధ్యాయుడు వాళ్ళ కుమార్తె మనస్విని 8 వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం.. పాఠ్య పుస్తకాలను అందిస్తామన్నారు. ప్రైవేట్ సంస్థల్లో వేలాది రూపాయలు వృధా చేసుకునే బదులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోచం, మధుకర్, శ్రీనివాస్, పీ డి కోమురోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేశాన్ని విషాదంలో ముంచిన విమాన ప్రమాదం

**- గుజరాత్ మాజీ సీఎం మరణం పార్టీకి తీరనిలోటు..**
**- మృతులకు నివాళులర్పించిన బిజెపి శ్రేణులు**



**పెద్దపల్లి ప్రతినిధి :** అహ్మదాబాదులో జరిగిన విమానప్రమాదం దేశాన్ని తీవ్ర విషాదంలో ముంచిందని బిజెపి శ్రేణులు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి శుక్రవారం జెండా చౌరస్తా వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని ఉండటం మరింత బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటన్నారు. పార్టీ ఒక శ్రేష్టమైన కార్యకర్తను కోల్పోయిందని కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వేల్పుల రమేష్, తంగేడ రాజేశ్వరరావు, కావేటి రాజగోపాల్, ఎర్రోళ్ల శ్రీకాంత్, గుడ్ల సతీష్, మామిడి ఉమేష్, శ్రీకాంత్ బొడ్డుపల్లి కుమారస్వామి, బొడ్డుపల్లి సంపత్, రేండ్ల వేణు, గదాసి సతీష్, సోడాబాబు, బాలసాని రాజేశం, బొడ్డుపల్లి అంజి, షిండే శివసాయి, మధుకరన్, భగవత్ తదితరులు పాల్గొన్నారు.

## జన ప్రతిధ్వని వేదిక (ఎన్జీఓ) సంస్థ రాష్ట్రఅధ్యక్షునిగా బాస మహేష్ ఏకగ్రీవ నియామకం....

**జగిత్యాల, ప్రతినిధి :** జగిత్యాల జిల్లా రేచుపెల్లి గ్రామానికి చెందిన బాస మహేష్ ను జన ప్రతిధ్వని వేదిక (ఎన్జీఓ) స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షునిగా ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ సభ్యులు తన పై ఉన్న నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల మహేష్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంస్థ సభ్యుల నమ్మకాన్ని వమ్మూ చేయకుండా సభ్యుల సలహాలు సూచనలు తీసుకొని సమన్వయముతో సంస్థ బలోపేతానికి ఆశయాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బాస మహేష్ ఒక ప్రకటనతో తెలిపారు. అలాగే. తన ఎన్నికకు సహకరించిన ప్రతి సభ్యునికి అధ్యక్షులు కృతజ్ఞతలు తెలియజేశారు..

## రైతులకు విద్యుత్ ఉపయోగం పై అవగాహన




**ముత్తారం.జూన్.12.:** ముత్తారం మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు.రైతులు నాణ్యమైన విద్యుత్ కొరకు కెపాసిటర్లను అలాగే ఐఎస్ఐ కి సంబంధించిన మోటర్లను ఉపయోగించాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ అధికారులకు తెలుపాలని విద్యుత్ నియంత్రికల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సూధాటి రవీందర్ రావు,రైతులు సంపత్ రావ్, రాజమల్లు, రాజేశం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



**ముత్తారం.జూన్.13.** ముత్తారం మండలంలోని జిల్లెలపల్లి న్యూ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకటవ తరగతిలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు తల్లితండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించి, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చొప్పరి రమ, ఉపాధ్యాయులు రాజేందర్, వెంకటేష్, అంగన్వాడీలు సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ



**ముత్తారం.జూన్.13.:** ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంపీడీవో సురేష్ పాఠ్యపుస్తకాలు,దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య,మెరుగైన సౌకర్యాలను ఇస్తుందని విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పద్మాదేవి, రాజేందర్, ఎంపీడీవో సురేష్, ఏపిఎం పద్మ, ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాక ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం

**- ఓనమాలు దిద్దించిన ఇంచార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్**
**- పదిహేను మంది 1వ తరగతిలో చేరిన విద్యార్థులు**



**ధర్మారం, జూన్ ,13 :** అక్షర సేద్యంతోనే అందరి జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయని ధర్మారం మండల ఇంచార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున ధర్మారం మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే నిరంతరం చదువు నేర్చుకుంటూనే ఉండాలని అన్నారు. ప్రతీ ఒక్కరికి బాల్యదశ చాలా ముఖ్యమైనదని బాల్యంలో విద్యార్థులు ఏర్పరచుకున్న లక్ష్యాలే జీవిత గమనాన్ని నిర్దేశిస్తాయని అన్నారు. కావున విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని అన్నారు. విద్యార్థులంతా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకొని ప్రతిభవంతులవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి పూజ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకి పలకలపై ఓనమాలు పెట్టించటం జరిగింది. అనంతరం తీపి పంపకం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, హైస్కూల్ ఉపాధ్యాయులు విఠల్, ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు శ్రీలత, శారద, సునిల్, అంగన్వాడీ టీచర్ వినోద, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం..... !

**ఇల్లంతకుంట, జూన్ 13,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లికి చెందిన పండుగ చక్రపాణి (43) అనే వ్యక్తి గత కొంతకాలంగా భార్య,తన తల్లితో కలహాల కారణంగా మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చక్రపాణి మృతి చెందాడని మృతుడి సోదరుడు పండుగ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# స్పోర్ట్స్

# సౌతాఫ్రికా ముందు 282 పరుగుల టార్గెట్

## ఆస్ట్రేలియా రెండవ ఇన్నింగ్స్ లో 207 పరుగులకు ఆలౌట్



క్రికెట్ అభిమానుల ఉత్కంఠను తారాస్థాయికి చేర్చిన ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (%ఔజ%) ఫైనల్ 2025లో, దక్షిణాఫ్రికాకు ఆస్ట్రేలియా 282 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. లార్డ్స్‌లోని బౌలర్‌లకు స్వర్గధామమైన పిచ్‌పై ఈ లక్ష్యం దక్షిణాఫ్రికాకు ఒక సవాలుగా మారనుంది. ఆస్ట్రేలియా తమ రెండవ ఇన్నింగ్స్ లో 207 పరుగులకు ఆలౌట్ కావడంతో, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం 74 పరుగులతో కలిపి మొత్తం 281 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించుకుంది. మ్యాచ్ మొదటి రెండు రోజులు బౌలర్లదే ఆధిపత్యం. ఇరు జట్ల బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ లో 138 పరుగులకు ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 212 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా రెండవ ఇన్నింగ్స్ లో కూడా టాప్ ఆర్డర్ తడబడినప్పటికీ, మిచెల్ స్టార్క్ (58), జోష్ హేజెల్ వుడ్ (17) చివరి వికెట్ కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పి ఆస్ట్రేలియాను గౌరవప్రదమైన స్థితికి చేర్చారు. లార్డ్స్ లో 250కి పైగా పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం టెస్ట్ చరిత్రలో కేవలం మూడు సార్లు మాత్రమే సాధ్యమైంది. 1984లో వెస్టిండీస్ 344 పరుగులను, 2004లో ఇంగ్లాండ్ 282 పరుగులను, 2022లో ఇంగ్లాండ్ 277 పరుగులను విజయవంతంగా ఛేదించాయి. ఈ గణాంకాలు దక్షిణాఫ్రికా ముందున్న సవాలును స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అయితే, ఈ డబ్ల్యూటీసీ ఫైనల్ లో ఏ క్షణంలోనైనా మ్యాచ్ స్వరూపం మారే అవకాశం ఉంది. పిచ్ ఇంకా బౌలర్లకు అనుకూలంగా ఉన్నప్పటికీ, నాలుగవ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి కొంత తేలికపడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఈ కఠినమైన లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టిస్తారా, లేదా ఆస్ట్రేలియా తమ బౌలింగ్ పదునుతో డబ్ల్యూటీసీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా అనేది చూడాలి. తొలి రోజు తరహాలోనే రెండో రోజు కూడా బౌలర్ల హవానే నడిచింది. మొత్తం 14 వికెట్లు నేలకూలాయి. అంతకుముందు 43/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హామ్(111 బంతుల్లో 6 ఫోర్లతో 45), టెంబా బవుమా(84 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 36) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్(6/28) ఆరు వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. కమిన్స్‌కు తోడుగా మిచెల్ స్టార్క్(2/41) రెండు వికెట్లు తీయగా..జోష్ హజెల్ వుడ్(1/27)కు ఓ వికెట్ దక్కింది. వర్షం అంతరాయం కలిగించడం సౌతాఫ్రికా కొంపముంచింది. వర్షం అనంతరం పిచ్ కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా మారడంతో సౌతాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సఫారీ బౌలర్లు నిప్పులు చెరిగారు. దాంతో ఉస్మాన్ ఖవాజా(6), కామెరూన్ గ్రీన్(0), స్టీవ్ స్మిత్(13), ట్రావిస్ హెడ్(9), బ్యూ వెబ్‌స్టర్(9), ప్యాట్ కమిన్స్(6) తీవ్రంగా నిరాశపరిచారు. మిచెల్ స్టార్క్ సాయంతో అలెక్స్ క్యారీ పోరాడాడు. ఈ జోడీని విడదీసే అవకాశాలను సౌతాఫ్రికా చేజార్చుకుంది. డీఆర్ఎస్‌లను వృథా చేసుకోవడంతో పాటు స్టార్క్ ఇచ్చిన క్యాచ్‌లను అందుకోలేకపోయింది. దాంతో ఆసీస్ గౌరవప్రదమైన స్కోర్ అందుకుంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా విజయం సాధించాలంటే అద్భుతం జరగాలి. తొలి ఇన్నింగ్స్‌లో 200 పరుగులు చేయలేకపోయినా.. సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని అందుకోవడం కష్టమనే చెప్పాలి.

## ఓటమికి ఒకర్ని నిందించను: శ్రేయస్ అయ్యర్

ముంబై టీ20 ప్రీమియర్ లీగ్ ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించిన సోబో ముంబై ఫాల్కన్స్ ఓటమిపాలైంది. 9 రోజుల వ్యవధిలోనే కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ రెండు ఫైనల్ మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూశాడు. ఈ నెల 3న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ నడిపించిన పంజాబ్ కింగ్స్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఇక గురువారం జరిగిన ముంబై ప్రీమియర్ టీ20 లీగ్ ఫైనల్లో ముంబై సౌత్ సెంట్రల్ మరాఠ రాయల్స్ చేతిలో శ్రేయస్ నడిపించిన ముంబై ఫాల్కన్స్ జట్టు ఓటమిపాలైంది. ఈ రెండు ఫైనల్లోనూ శ్రేయస్ అయ్యర్ బ్యాటర్‌గా విఫలమయ్యాడు. టీ20 ఫార్మాట్‌లో అద్భుతమైన కెప్టెన్‌గా ప్రశంసలు అందుకుంటున్న అయ్యర్.. కీలక మ్యాచ్‌ల్లో బ్యాట్‌తో రాణించలేక విమర్శల పాలవుతున్నాడు. తాజా ఫైనల్లో శ్రేయస్ అయ్యర్(17 బంతుల్లో 12) వైఫల్యంతో ముంబై ఫాల్కన్స్ జట్టు 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఫాల్కన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులే చేసింది. అనంతరం ముంబై సౌత్ సెంట్రల్ మరాఠ రాయల్స్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసి గెలుపొందింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసిందన్నాడు. అయితే ఈ ఓటమికి జట్టులో ఏ ఒక్కర్ని నిందించలేనని స్పష్టం చేశాడు. 'ఈ ఓటమికి ఒకర్ని నిందిస్తూ.. ఓ ప్రత్యేకమైన సంఘటన కారణమని నేను చెప్పాలనుకోవడం లేదు. ఓవరాల్‌గా మా జట్టు ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. ఫైనల్‌కు చేరే క్రమంలో మేం ఒక్క మ్యాచ్ కూడా ఓడలేదు. ఫైనల్లోనే ఓటమిపాలయ్యాం. ఈ టోర్నీ మేం ఓడించి ఒకే ఒక్క మ్యాచ్. కాబట్టి ఈ ఓటమికి నేను ఎవర్నీ నిందించలేను. అలా చేస్తే ఓ ఆటగాడికి వెన్నుపోటు పొడిచినట్లు అవుతుంది. అలా చేయడం నాకు ఇష్టం ఉండదు. ఫైనల్లో ఓడిన తర్వాత నిరాశకు గురవ్వడం సర్వసాధారణం. ఈ ఓటమి మా ఆటగాళ్లకు బాధ కలిగించి ఉంటుంది. కానీ వచ్చే ఏడాదికి ఈ ఓటమి అదనపు ప్రేరణగా.. ఆత్మవిశ్వాసంగా మారుతుంది. మా కుర్రాళ్లు వారి ప్రదర్శన పట్ల గర్వపడాలి. వరుసగా రెండు ఫైనల్లో ఓడిపోవడం బాధగానే ఉంది.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.





## అందరి దృష్టి భారత బ్యాటింగ్ లైనప్ పైనే..


### ఇంగ్లాండ్ తో 20 నుంచి లీడ్స్ లో తొలి టెస్టు

ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ 2025-27 సైకిల్ ను ఈసారి విదేశాల్లో భారత్ ప్రారంభించబోతోంది. ఐదు టెస్టుల సిరీస్ తో ప్రతిష్టాత్మక పోరును మొదలు పెట్టనుంది. ఇంగ్లాండ్ తో ఈనెల 20 నుంచి లీడ్స్ మైదానంలో జరిగే తొలి టెస్టు ద్వారా చాలెంజింగ్ టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఇక ఈ సారి దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండానే టీమిండియా ఈ టూర్ చేస్తోంది. పేపర్ పై అంత అనుభవం లేకుండా కనిపిస్తున్న భారత జట్టులో ప్రతిభకు కొదువలేదు. ఇప్పటికే దేశవాళీతోపాటు వివిధర రకాల ఎన్నో మ్యాచ్ ల్లో రాణించిన అనుభవం భారత్ సొంతం. అయితే ఈ సిరీస్ లో అందరి దృష్టి భారత బ్యాటింగ్ లైనప్ పైనే ఉంది. సరికొత్తగా ప్రారంభం కాబోతున్న ఈ లైనప్ లో ఎవరెవరు ఆడాలో, ఇప్పటికే పలువురు దిగ్గజాలు సూచనలు చేశారు. తాజాగా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప.. ఇంగ్లాండ్ లో బరిలోకి దిగబోయే భారత బ్యాటింగ్ లైనప్ పై వ్యాఖ్యానించాడు. ఒక ఓపెనర్ గా యశస్వి జైస్వాల్ ఖాయం కాగా, ప్రస్తుత టూర్లో సత్తా చాటిన సీనియర్ బ్యాటర్ లోకేశ్ రాహుల్ ను జైస్వాల్ కు తోడుగా ఓపెనింగ్ చేయించాలని సూచిస్తున్నాడు. ప్రస్తుత టూర్లో ప్రాక్టీస్ మ్యాచ్ ల్లో ఒక సెంచరీ, ఫిఫ్టీతో సత్తా చాటాడు. అలాగే గతంలో ఇంగ్లాండ్ తోపాటు ఆసీస్ లోనూ రాణించిన అనుభవం అతని సొంతమని చెప్పాడు. ఇక నెంబర్ త్రీలో ఐపీఎల్లో విశేషంగా రాణించిన సాయి సుదర్శన్ ను తీసుకోవాలని సూచిస్తున్నాడు. దీంతో టాప్ త్రీ బలంగా ఉంటుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో నెంబర్లో కెప్టెన్ శుభమాన్ గిల్, ఐదో స్థానంలో అనుభవం గల కరుణ్ నాయర్ ను ఆడించాలని సూచించాడు. అప్పుడే బ్యాటింగ్ లో స్థిరత్వం ఉంటుందని పేర్కొన్నాడు. ఇక ఆరో నెంబర్లో డాషింగ్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ను బరిలోకి దించాలని పేర్కొన్నాడు. ఇక ఏడో స్థానంలో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిని ఆడించాలని సూచించాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా ఆడిస్తే, అటు నాలుగో పేసర్ గానూ, ఇటు బ్యాటింగ్ లోనూ డెప్త్ ఉంటుందని పేర్కొన్నాడు. ఎనిమిదో స్థానంలో వెటరన్ స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను ఆడించాలని సూచించాడు. దీంతో కుల్దీప్ యాదవ్ ను పక్కన పెట్టాలని పేర్కొన్నాడు. ఇక పేస్ బాధ్యతలను జస్ ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణలకు అప్పగించాలని, వీరికి తోడుగా నాలుగో పేసర్ గా నితీశ్ ఉంటాడని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ పరిస్థితులకు ఇదే బెస్ట్ బ్యాటింగ్ లైనప్ అని విశ్వాసం వ్యక్తం చేశాడు. తాజా లైనప్ తో జట్టు సమతూకంతో ఉందని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా అటు కోచ్ గౌతం గంభీర్, ఇటు కెప్టెన్ గిల్ ఆలోచలకు తగిన ప్లేయింగ్ లెవన్ ఏ విధంగా ఉంటుందో తెలియాలంటే మరో వారం రోజులు ఆగక తప్పని పరిస్థితి నెలకొంది.

# 'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం!



ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో భాగంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ఫైనల్లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం తీవ్ర చర్చనీయాంశమైంది. సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ బెడింగ్‌హామ్ తన ప్యాడ్‌లో ఇరుక్కున్న బంతిని చేత్తో కిందపడేయడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఔటంటే.. మరికొందరు నాటౌట్ అని కామెంట్ చేస్తున్నారు. గురువారమైన రెండో రోజు ఆటలో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా బ్యూ వెబ్‌స్టర్ వేసిన 49వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ మూడో బంతిని వెబ్‌స్టర్ ఆఫ్ స్టంప్ లైన్‌లో వేయగా.. బెడింగ్‌హామ్ డిఫెన్స్ చేసే ప్రయత్నం చేశాడు. కానీ ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్న బంతి బెడింగ్‌హామ్ ప్యాడ్‌లో ఇరుక్కుంది. ఆ బంతి కిందికి వచ్చే అవకాశం ఉండటంతో ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ క్యాచ్ కోసం ప్రయత్నించాడు. కానీ బెడింగ్‌హామ్ బంతిని చేత్తో తీసి కిందపడేసాడు. దాంతో ఆసీస్ ఆటగాళ్లు 'హ్యాండిల్డ్ ది బాల్' గురించి అప్పీల్ చేశారు. అయితే అంపైర్లు నాటౌట్‌గా ఇచ్చారు. అప్పటికే బంతి డెడ్ బాల్ అయిందని స్పష్టం చేశారు. క్రికెట్ నియమాల ప్రకారం బంతి బ్యాటర్ ప్యాడ్లలో లేదా దుస్తుల్లో ఇరుక్కుంటే డెడ్ బాల్‌గా పరిగణిస్తారు. బ్యాటర్ పట్టుకున్నా నాటౌట్‌గానే ఇస్తారు. అయితే రిప్లేలో బంతి కిందపడేసే క్రమంలో బెడింగ్‌హామ్ బంతిని పట్టుకోవడం వివాదమైంది. బంతి డెడ్ అయినప్పుడు కాకుండా కదులుతూ ఉన్న సమయంలో పట్టుకున్నాడని, ఔటేనని కొంతమంది వాదిస్తున్నారు. బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా చేతితో బంతిని అడ్డుకుంటే హ్యాండిల్డ్ ది బాల్ రూల్ కింద ఔటిస్తారు. బ్యాటర్ బంతి వికెట్ల వైపు వెళ్లకుండా అడ్డుకోవడం లేదా ఫీల్డర్ క్యాచ్ పట్టకుండా చేస్తే ఈ రూల్ కింద ఔట్ ఇస్తారు. బ్యాటర్ తన శరీరాన్ని గాయం నుంచి రక్షించుకోవడానికి బంతిని చేతితో తాకితే మాత్రం ఔటివ్వకుండా మినహాయింపు ఇస్తారు. గతంలో 'హ్యాండిల్డ్ ది బాల్' అనేది క్రికెట్ నిబంధనల్లో ఒక ప్రత్యేకమైన ఔట్(లా 33) పద్ధతిగా ఉండేది. 2017లో %వీజజ% (మేరిల్‌బోన్ క్రికెట్ క్లబ్) ఈ రూల్‌ను సవరించింది. ఈ రూల్‌ను అబ్‌స్టక్టింగ్ ద ఫీల్డ్(లా 37) అనే నియమంలో విలీనం చేసింది. ఈ రూల్ ప్రకారం బంగ్లాదేశ్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ ఒక మ్యాచ్‌లో ఔటయ్యాడు. బౌలర్ వేసిన బంతిని డిఫెండ్ చేసిన తర్వాత, అది వికెట్ల వైపు వెళ్లకుండా అతను చేతితో అడ్డుకున్నాడు.



## టీ20 ఇన్నింగ్స్‌లో కొత్త ప్రపంచ రికార్డు

### సూర్యవంశీ, గేల్ రికార్డ్‌లను బ్రేక్ చేసిన పై అలెన్

మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. టోర్నమెంట్‌లోని మొదటి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ ఫిన్ అలెన్ సంచలనం సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్ప్ తరపున వాషింగ్టన్ ఫ్రీడమ్ పై అలెన్ కేవలం 51 బంతుల్లో 151 పరుగులు చేసి, టీ20 క్రికెట్ చరిత్రలో పలు రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ అసాధారణ ఇన్నింగ్స్‌తో శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్ప్ 123 పరుగుల భారీ తేడాతో వాషింగ్టన్ ఫ్రీడమ్ ను చిత్తు చేసింది. ఫిన్ అలెన్ ఇన్నింగ్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన అంశం అతను బాదిన సిక్సర్ల సంఖ్య. అలెన్ 19 సిక్సర్లు కొట్టి, టీ20 ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ (18 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు. 2017లో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో రంగపూర్ రైడర్స్ తరపున క్రిస్ గేల్ ఈ రికార్డును నెలకొల్పగా, ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ కూడా 2024లో 18 సిక్సర్లతో ఈ రికార్డును సమం చేశాడు. ఇప్పుడు ఫిన్ అలెన్ 19 సిక్సర్లతో వారిద్దరినీ అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించాడు. అలెన్ తన 150 పరుగులను కేవలం 49 బంతుల్లోనే సాధించి, టీ20 క్రికెట్ లో అత్యంత వేగంగా 150 పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు డెవాల్డ్ బ్రేవస్ (52 బంతులు) పేరిట ఉండేది. ఫిన్ అలెన్ 151 పరుగుల ఇన్నింగ్స్ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నమోదైంది. గతంలో నికోలస్ పూరన్ 2023 ఫైనల్ లో చేసిన 137 పరుగులే అత్యధికం. కేవలం 34 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. ఇది టీ20 ఫ్రాంచైజీ లీగ్ లలో క్రిస్ గేల్ (30 బంతులు, ఐపీఎల్ 2013) తర్వాత రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్ప్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్ పుణ్యమా అని 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. ఇది చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరుగా నిలిచింది. అమెరికా గడ్డపై టీ20 మ్యాచ్ లో 200 పరుగుల మార్కును దాటిన తొలి జట్టుగా యునికార్న్ప్ నిలిచింది. 123 పరుగుల తేడాతో గెలిచిన శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్ప్, %మీజ% చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతో విజయం సాధించిన జట్టుగా రికార్డు సృష్టించింది. వాషింగ్టన్ ఫ్రీడమ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన గ్లెన్ మాక్స్ వెల్, అలెన్ బ్యాటింగ్‌ను అభినందించాడు. పిచ్ బ్యాటింగ్ కు అనుకూలంగా ఉందని, బౌండరీలు చిన్నవిగా ఉన్నాయని, కానీ అలెన్ ఆధిపత్యం తమ ప్రణాళికలను దెబ్బతీసిందని పేర్కొన్నాడు. ఫిన్ అలెన్ ఈ రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ తో మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. రాబోయే మ్యాచ్ లలో మరిన్ని అద్భుత ప్రదర్శనలను ఆశించవచ్చు.

## ఇంగ్లాండ్ పర్యటన నుంచి మధ్యలోనే వెనుదిరిగిన గంభీర్

టీమ్ఇండియా ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. ఈ టూర్?లో ప్రత్యర్థి ఇంగ్లాండ్?తో భారత్ ఐదు టెస్టు మ్యాచ్?ల సిరీస్ ఆడనుంది. జూన్ 20న తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో భారత జట్టు నెట్స్?లో తీవ్రంగా శ్రమిస్తోంది. శుక్రవారం ఇంగ్లాండ్?తో ఇన్?ట్రా స్క్వాడ్ మ్యాచ్ కూడా ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో హెడ్ కోచ్ గంభీర్ శుక్రవారం భారత్?కు బయల్దేరాడు. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా ఇంగ్లాండ్ పర్యటన నుంచి మధ్యలోనే వచ్చేస్తున్నట్లు క్రీడా వర్గాలు తెలిపాయి. 'ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా, భారత్ హెడ్ కోచ్ గంభీర్ ఇంగ్లాండ్ టూర్ నుంచి భారత్?కు తిరిగి వచ్చేస్తున్నాడు' అని క్రీడా వర్గాలు మీడియాకు వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం అతడు సిరీస్ ముగిసే దాకా అక్కడే ఉండాలి. కానీ, వ్యక్తిగత కారణాల వల్ల ఇంతలోనే గంభీర్ తిరుగు ప్రయాణం అయ్యాడు. అయితే రోహిత్, విరాట్ రిటైర్మెంట్ అవ్వడం వల్ల సీనియర్లు లేకుండానే యువ కెప్టెన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో గంభీర్ కూడా తిరిగి వస్తుండడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపే ఛాన్స్ ఉంది. భారత టెస్టు జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు : షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జామీ ఓవర్‌టన్, ఆలీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్), బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోష్ టోక్స్, క్రిస్



## ఈ విత్తనాలు తీసుకుంటే బరువు ఇట్టే తగ్గుతారు..

చాలామంది బరువు తగ్గాలని కోరుకుంటారు. దీనికోసం ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలం అవుతుంటారు. ఒకవేళ మీరు బరువు తగ్గాలనుకుంటే కొన్ని విత్తనాలను ఆహారంలో చేర్చుకుంటే సరిపోతుంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పుడు బరువు తగ్గడంలో సహాయపడే కొన్ని విత్తనాల గురించి తెలుసుకుందాం.చియా గింజలు సైజులో చిన్నగా ఉన్నా కానీ దాన్ని తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. ఈ గింజల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆహారాన్ని తక్కువ తీసుకోవడానికి ఉపయోగపడతాయి. అవిసె గింజలు కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో లిగ్నాన్లు, ఫైబర్ నిండి ఉంటాయి. దీంతో ఇవి జీర్ణక్రియను నెమ్మదిస్తాయి. వీటి వినియోగం ఆకలిని కూడా తగ్గిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి. సోంపు గింజలును మౌత్ ప్రెషర్ గా ఉపయోగిస్తాము. కానీ వీటిని తీసుకుంటే అనేక లాభాలు ఉంటాయి. సోంపు గింజలు జీర్ణక్రియ, ఆకలిని కూడా అణిచివేయడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఇవి జీవక్రియను పెంచుతాయి. బరువు తగ్గడానికి కూడా ఎంతో సహాయపడతాయి. గుమ్మడికాయ గింజల్లో ప్రోటీన్, మెగ్నీషియం, ఐరన్ అధికంగా నిండి ఉంటాయి. ఇవి శరీర కొవ్వును బాగా కరిగించడానికి ఉపయోగపడతాయి. నువ్వులు శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఉండే ఫైబర్, ప్రోటీన్ బరువు తగ్గడానికి ఎంతో ఉపయోగపడతాయి. వీటి వినియోగం ఇట్టే కొవ్వును కరిగిస్తాయి.

## నేరేడు పండ్లు తింటున్నారా..?



మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. తాజా కూరగాయలు, పండ్లు తీసుకుంటే మన శరీరానికి కావాల్సినంత బలం వస్తుంది. ఎంతో ఆరోగ్యంగా కూడా ఉంటాము. అయితే, పండ్లలో భాగంగా మనం నేరేడు పండు తినే ఉంటాము. నేరేడు పండ్లలో అనేక పోషకాలు నిండి ఉంటాయి. ఇందులో ఉండే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, సోడియం, విటమిన్ సి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. అయితే ఇప్పుడు నేరేడు పండ్లు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. నేరేడు పండ్లలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ పుష్కలంగా ఉంటాయి. దీని కారణంగా ఈ పండ్లను తినడం వల్ల అజీర్ణం, కడుపునొప్పి వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ పండ్లు రోగ నిరోధక శక్తిని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం రక్తహీనతను నివారిస్తుంది. నేరడు పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దీంతో ఇవి కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతూ, చర్మాని అనేక సమస్యల నుండి కాపాడుతుంది. జాగ్రత్తలు.. నేరేడు పండ్లను ఎప్పుడు ఖాళీ కడుపుతో తినకూడదు. కారణం.. ఇది వాతకారిగా పనిచేస్తుంది. అంతేకాకుండా ఖాళీ కడుపుతో ఈ పండ్లను తీసుకుంటే గ్యాస్ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పండును సరైన సమయంలో అంటే మధ్యాహ్నం భోజనం తర్వాత తీసుకోవచ్చు.

## గర్భిణీలు కొబ్బరి నీరు తాగితే ఏమౌతుందో తెలుసా..?



గర్భం దాల్చిన తర్వాత స్త్రీ శరీరంలో జరిగే మార్పులు, వాటికి అనుగుణంగా వచ్చే చిన్ని చిన్ని ఇబ్బందులను అధిగమించడానికి పోషకాలతో కూడిన ఆహారం, ద్రవాలు చాలా ముఖ్యం. ఇలాంటి సమయంలో ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన ద్రవాలలో ఒకటి - కొబ్బరి నీరు. కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, ఇది గర్భధారణ సమయంలో తల్లికి, పెరుగుతున్న శిశువుకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది.

రోజూ కొబ్బరి నీరు తాగవచ్చా?

గర్భధారణ సమయంలో రోజూ కొబ్బరి నీరు తాగడం చాలా సురక్షితమైనది, ఆరోగ్యకరమైనది కూడా. పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా దీనిని సిఫార్సు చేస్తుంటారు. అయితే, మితంగా తీసుకోవడం ఎల్లప్పుడూ మంచిది.

కొబ్బరి నీటి వల్ల కలిగే ప్రయోజనాలు:


గర్భధారణ సమయంలో డీహైడ్రేషన్ సాధారణం. కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్ (పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం) పుష్కలంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన ద్రవాలను అందించి, హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఇది ముఖ్యంగా ఉదయం అలసట (మార్నింగ్ సిక్‌నెస్) సమయంలో చాలా ఉపశమనాన్ని ఇస్తుంది. గర్భిణులలో సాధారణంగా కనిపించే వికారం, వాంతులు తగ్గించడానికి కొబ్బరి నీరు అద్భుతంగా పనిచేస్తుంది.దీనిలోని సున్నితమైన రుచి, సహజమైన చక్కెరలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచుతాయి. కొబ్బరి నీరు ఆమ్లత్వాన్ని తగ్గించి, గుండెల్లో మంట, అజీర్తి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.లారిక్ యాసిడ్ వంటి యాంటీవైరల్, యాంటీబాక్టీరియల్ గుణాలు కొబ్బరి నీటిలో ఉంటాయి, ఇవి తల్లి, బిడ్డ ఇద్దరికీ రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. కొబ్బరి నీటిలోని సహజ చక్కెరలు, విటమిన్లు గర్భిణులకు అవసరమైన శక్తిని అందించి, అలసటను తగ్గిస్తాయి. కొబ్బరి నీటిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి, గర్భధారణ సమయంలో సాధారణంగా వచ్చే మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది.ఇది మూత్రపిండాల పనితీరును మెరుగుపరచి, మూత్రనాళ ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. ముఖ్య సూచనలు : స్వచ్ఛమైన కొబ్బరి నీటిని తాగడానికి ప్రయత్నించండి.కొబ్బరి నీటిని త్రాగడానికి ముందు మీ వైద్యుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది, ముఖ్యంగా మీకు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే. ఒకేసారి అతిగా కాకుండా, మితమైన పరిమాణంలో తీసుకోవడం ఉత్తమం.



## భోజనం తర్వాత వాకింగ్ చేయాలా? వద్దా?

వాకింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. బరువు తగ్గాలనుకునే వారికి వాకింగ్ సులభమైన మార్గం. అయితే, వాకింగ్ ఎప్పుడు చేయాలనే విషయంపై అవగాహన ఉండాలి. కొందరు ఉదయాన్నే వాకింగ్ చేస్తే. మరి కొందరు సాయంత్రం వాకింగ్ చేస్తారు. అయితే సాధారణంగా తిన్న తర్వాత వాకింగ్ చేయాలా వద్దా అనే అంశంపై వివిధ అభిప్రాయాలు వినే విని ఉంటారు. అయితే కొందరు భోజనం తర్వాత వాకింగ్ చేస్తే మంచిదని భావిస్తారు. మరికొందరు భోజనం తర్వాత వాకింగ్ చేయడం మంచిది కాదని నమ్ముతారు. ఈ క్రమంలో పలువురు వైద్యులు భోజనం తర్వాత వాకింగ్ చేయాలా వద్దా అని వివరించారు. వైద్యులు చెప్పిన ప్రకారం.. భోజనం తర్వాత దాదాపు 10 నుండి 15 నిమిషాలు పాటు అవసరమని చెప్పారు. భోజనం తర్వాత వాకింగ్ చేస్తే జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా షుగర్ మెటబాలిజంలో ఎంతో సహాయపడుతుంది. తిన్న తర్వాత వాకింగ్ చేస్తే షుగర్ లెవెల్స్ పెరిగే అవకాశం తగ్గుతుంది. అయితే భోజనం తర్వాత వాకింగ్ సరైన రీతిలో చేయాలి. వాకింగ్ భోజనం చేసిన తర్వాత తేలికగా, ఇంట్లో చేసే విధంగా ఉండాలి.

# ఏడువేల అడుగులేస్తే..



ఆనందంగా జీవించాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా జీవించాలంటే? రోజూ నడవాలని చెబుతున్నారు నిపుణులు. నడకతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిసిందే. కానీ, ఒళ్లు రోగాలపుట్టగా మారిన తర్వాత ఎంత నడిస్తే ఏం ప్రయోజనం! అందుకే, ఆరోగ్యంగా ఉన్నప్పుడే నడకను జీవితంలో భాగం చేయాలని చెబుతున్నారు వైద్యులు. ప్రతి రోజూ ఏడువేల అడుగుల చొప్పున నడిస్తే.. ఆరోగ్యం మీ వెన్నంటి ఉంటుందని అంటున్నారు. నిత్యం ఏడువేల అడుగులు వేస్తూ, సరైన ఆహారం తీసుకుంటూ, సరిపడా విశ్రాంతి తీసుకుంటూ ఉంటే రెండు నెలల్లో శరీరం దృఢంగా తయారవుతుందట. ఇలా చేయడం వల్ల కార్డియోవాస్కులార్ సమస్యలు రాకుండా ఉంటాయట. బరువు నియంత్రణలో ఉంటుంది. మానసిక ప్రశాంతత పెరుగుతుంది. ఎనర్జీ లెవెల్స్ కూడా పెరుగుతాయని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. రోజూ నడవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గుతుంది. అలాగే రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. కీళ్లు, కండరాలు బలపడతాయి. మరింత మెరుగైన ప్రయోజనాలు పొందాలంటే ఏడువేల అడుగుల ప్రయాణాన్ని పది వేలకు పెంచుకోవచ్చని సూచిస్తున్నారు. సాధారణంగా అయిదు వేల అడుగుల నడకను శరీరక శ్రమ లేని (సెడంటరీ లైఫ్) జీవనంగానే గుర్తిస్తారు. అంతకంటే ఎక్కువ నడవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నడక వల్ల కలిగే అన్ని రకాల ప్రయోజనాలు పొందాలంటే కనీసం ఏడు వేల అడుగులు, ఓపిక చేసుకొని పదివేల అడుగుల దూరం నడవాల్సిందే! ఇంకెందుకు ఆలస్యం ముందడుగు వేయండి!


# మార్కెట్

## కీలక ఖనిజాన్వేషణలో సింగరేణి

హైదరాబాద్ జూన్ 12 (నమస్తేతెలంగాణ): సింగరేణి తాజాగా కీలక ఖనిజాల అన్వేషణ, పరిశోధన రంగాల్లో తొలి అడుగు వేసింది. ఈ దిశగా సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్), ఐఎంఎంటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నీతి ఆయోగ్ సభ్యుడు, డీఆర్డీవో రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ వీకే సారస్వత్ సమక్షంలో సింగరేణి జీఎం (ఎక్స్‌ప్లొరేషన్) బీ శ్రీనివాస్, జీఎం(బీడీ అండ్ఎస్పీ) రామదాసు, సీఎస్ఐఆర్, ఐఎంఎంటీ చీఫ్ సైంటిస్ట్..హైడ్రో మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి చైర్మన్ బలరాం మాట్లాడుతూ%ౌ% వ్యాపార విస్తరణలో భాగంగా ప్రభుత్వాల సూచనల మేరకు కీలక ఖనిజాల అన్వేషణలోకి అడుగు పెట్టామన్నారు. ఈ రంగంలో సీఎస్ఐఆర్-ఐఎంఎంటీలు సాంకేతిక సహకారం అందిస్తాయని వెల్లడించారు. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని తెలిపారు. అలాగే ఎన్టీపీసీ నుంచి విద్యుత్ ఉత్పత్తి సమయంలో విడుదలయ్యే ఫ్లైయాష్‌లోనూ ఈ మూలకాలను కనుగొన్నారన్నారు. మణుగూరు సమీపంలోని దుర్గంగుట్ట బ్లాక్‌లో సగటున 266.21 పీపీఎం స్థాయిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జీఎస్ఐ నిర్ధారించిందని, మొత్తంగా సింగరేణి గనుల్లో లాంథనం, సీరియం లాంటి ఆరు రకాల రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇట్రిడియం, స్కాండియం, డిస్ప్రోజియం లాంటి హెవీ రేర్ ఎర్త్ మూలకాల ఉనికిని గుర్తించామన్నారు.

### కుప్పకూలిన విమాన షేర్లు..

# ఎయిర్ ఇండియా ప్రమాదంతో నష్టాలు



స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి

భారీగా పడిపోయిన ఇండిగో షేర్ విలువ

బోయింగ్ షేర్లూ ధమాల్

ముంబై, జూన్ 12: గుజరాత్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఘోర విమాన ప్రమాదం.. దేశీయ స్టాక్ మార్కెట్లనూ ప్రభావితం చేసింది. అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం లండన్‌కు బయలుదేరిన ఫ్లైట్.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ నేపథ్యంలో అటు బాంబే స్టాక్ ఎక్సేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో నమోదైన ఆయా విమానయాన రంగ కంపెనీల షేర్లు పెద్ద ఎత్తునే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మదుపరులు భారీగా పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఇండిగోకు గట్టి దెబ్బ దేశీయ విమానయాన రంగ దిగ్గజ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ (ఇండిగో) షేర్ల విలువ భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే ఎన్ఎస్ఈలో ఇండిగో స్టాక్ ధర రూ.187 పతనమైంది. ఇది కంపెనీ షేర్ విలువలో 3.32 శాతానికి సమానం. చివరకు రూ.5,444 వద్ద స్థిరపడింది. ప్రమాద ఘటనతో విమాన ప్రయాణ రక్షణపై ఏర్పడిన భయాలు ఎయిర్‌లైన్ స్టాక్స్‌ను ఒక్కసారిగా సెల్లింగ్ ప్రెషర్‌లోకి నెట్టాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అనుబంధ రంగాల్లోనూ.. విమానయాన అనుబంధ రంగాల కంపెనీల షేర్లూ నష్టాలకు గురయ్యాయి. యునిమెక్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ డైనమిక్స్, తనేజా ఏరోస్పేస్, టాల్ ఎంటర్‌ప్రైజెస్, ఎం టార్ టెక్నాలజీస్, ఆజాద్ ఇంజినీరింగ్ తదితర కంపెనీల షేర్ల విలువ 4.20 శాతం-1.34 శాతం వరకు పడిపోయింది. బోయింగ్ షేర్లు.. ప్రమాదానికి లోనైన ఎయిర్ ఇండియా విమానం.. బోయింగ్ సంస్థది కావడంతో సహజంగానే ఆ కంపెనీ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. గురువారం అమెరికా స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌లో ఒకానొక దశలో 8 శాతం వరకు పడిపోయాయి. ఆ తర్వాత కోలుకున్నా.. 5 శాతం నష్టాల్లోనే కదలాడుతున్నాయి. ఈ ప్రమాదంతో బోయింగ్ విమానాల అమ్మకాలు ప్రభావితం కావచ్చని, ప్రపంచ దేశాల నుంచి ఆర్డర్లు తగ్గిపోవచ్చన్న అంచనాలు ఈ అమెరికా కంపెనీ ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయి.

సెన్సెక్స్ 823 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 823.16 పాయింట్లు దిగజారి 81,691.98 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 253.20 పాయింట్లు లేదా 1.01 శాతం కోల్పోయి 24,888.20 వద్ద స్థిరపడింది. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడ్డట్టైంది. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, మిడిల్‌ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతల నడుమ ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో నడిచాయి.

ఒక్కరోజే రూ.5.98 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఈ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల షేర్ల విలువ రూ.5,98,759.27 కోట్లు హరించుకుపోయింది. దీంతో మదుపరుల సంపద రూ.4,49,58,383.92 కోట్లకు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లు, వీక్లీ ఎఫ్అండ్‌వో గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు చెప్తున్నారు.

# యోగ సాధనతో శారీరకంగా మరింత శక్తివంతం...

**పరిశ్రమల్లో "వర్క్ బిఫోర్ యోగ" అమలు చేయండి...**

**యోగ సాధన ప్రయోజనాలను అందరికీ తెలియజేద్దాం...**

**మహిళా పారిశ్రామికవేత్తల యోగ సాధన అభినందనీయం..**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





విజయవాడ : పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు యోగ సాధన ద్వారా శారీరకంగా మరింత శక్తి లభిస్తుందని పరిశ్రమలలో పనికి ముందు కొంత సమయం యోగాసనాలకు కేటాయించేలా పారిశ్రామికవేత్తలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా శుక్రవారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో మహిళా పరిశ్రమికవేత్తలతో కలిసి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ యోగాసనాలలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపద అయిన యోగాసనాల సాధనను నేడు ప్రపంచమంతా అనుసరించడం మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా సాధన ద్వారా శరీరానికి మరింత శక్తి చేకూరుతుందన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా గత 24 రోజులుగా వివిధ వర్గాల వారిని భాగస్వాములను చేసి వారి ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ మండలాలు పట్టణాలలో శిక్షకులతో యోగాసనాలను సాధన చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ప్రతి రోజు కనీస సమయాన్ని యోగ సాధనకు కేటాయించేలా పారిశ్రామికవేత్తలు చర్యలు తీసుకుని, యోగాను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలన్నారు. రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాసనాలను ఆచరించడం ఉత్తమ మార్గంగా కార్మికులు ఎంచుకోవాల్సిన అవసరముందన్నారు. మనసును లగ్నం చేసి యోగా శిక్షకుల సూచన మేరకు ఆసనాలను ఆచరించడం ద్వారా మనసును, శరీరాన్ని ఆధీనంలో ఉంచుకొని దృఢత్వం పొందేందుకు కార్మిక సోదరసోదరీమణులు కృషిచేయాలన్నారు. ప్రతిఒక్కరూ దిన చర్యలలో యోగా సాధన భాగంగా చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మానసిక ఒత్తిడితో పాటు శరీరక శ్రమ ఆధికమై అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. రోజువారి జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని యోగా సాధన ద్వారా అధిగమించవచ్చునని.. ఇది పరిశోధనల్లో తేలిందని యోగా సాధన శరీరానికి నూతన శక్తిని ఇస్తుందన్నారు. రుగ్మతుల నుండి రక్షణ పొంది ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకునేందుకు యోగాసనాల సాధనే ప్రధానమన్నారు. భారతదేశ వారసత్వ, సాంస్కృతిక సంపద అయిన యోగాను నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనుసరిస్తున్నాయన్నారు. జూన్ 21 నాటికి ఎన్‌టీఆర్ జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి యోగాసనాలు నేర్పించేందుకు జిల్లా యంత్రాంగం 5 వేల మంది శిక్షకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామం, మండలం, పట్టణం, నగరాల్లో వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే వేదికలు సిద్ధంచేసినట్లు వివరించారు. నిత్యం శారీరక శ్రమతో సతమతమయ్యే కార్మికులకు యోగాసనాలు దివ్య ఔషధం వంటివని, ఆసనాలను ఆచరించి నూతనోత్సాహం పొందడం ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలిప్) కార్యదర్శి కె. కనకదుర్గా, ఫెడరేషన్ అఫ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు వి. మురళికృష్ణ, దళిత్ ఇడియన్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామార్స్ జిల్లా కో-ఆర్డినేటర్ రాజామణి, జెఆర్‌డి టాటా అసోసియేషన్ చైర్మన్ వినోద్, ఇండస్ట్రీస్ జిఎం బి. సాంబయ్య, ఏపి ఎస్ఐసి జోనల్ మేనేజర్ బాబ్జి, డిఆర్‌డిఏ పిడి నాంచారయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ డా. జె.సుమన్, డా. రత్నప్రియదర్శిని, యోగా శిక్షకులు సత్యనారాయణ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ యుగేందర్ పాల్గొన్నారు.

# తప్పులు కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే యత్నం

**నకిలీ పట్టాలతో పేదలను మోసం చేసిన పేర్నినాని**

**దొంగపట్టాలపై విచారణతో వణికి పోతున్నాడు**

**మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**




మచిలీపట్టణం,జూన్13 : చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే కార్యక్రమాలకు మాజీమంత్రి పేర్ని నాని పాల్పడుతున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఎన్నికల్లో తన కొడుకుని గెలిపిచుకోవడం కోసం పడరానిపాట్లు పడి, చేయరాని తప్పులు చేశారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని నకిలీ పట్టాల వ్యవహారంపై మంత్రి కొల్లు రవీంద్ర షాకింగ్ కామెంట్స్ చేశారు. పేర్ని నానికి మతిభ్రమించిందని ఆరోపించారు. అరెస్ట్ భయంతో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటి నేతలను ఎందరినో చరిత్రలో చూశామని.. అవాకులు చవాకులు పేలిన చాలమంది నేతలు కాలగర్భంలో కలిసిపోయారని ఆక్షేపించారు. దొంగ పట్టాలు సృష్టించి అమాయక పేద ప్రజలకు పంచి పెట్టి మోసం చేశారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. ఆనాడు తహసీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి పూట దొంగ పట్టాలు తయారు చేయడాన్ని తాము రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని అన్నారు. స్ట్రీట్ ఫీల్డ్ పేరుతో పట్టాలు ఇచ్చి పేదలను మోసం చేశారని మండిపడ్డారు. నాడు పేర్ని నాని ఇచ్చిన దొంగ పట్టాలపై విచారణ జరుగుతుంటే గజ గజ వణికిపోతున్నాడని సెటైర్లు గుప్పించారు. తండ్రీ కొడుకులు ఇద్దరూ పారిపోయి హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ పిటీషన్లు వేశారని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు తహసీల్దార్‌గా సునీల్ ఉన్నారని చెబుతున్నావ్.. ఎక్కడ ఉన్నారో చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు. కోడ్ వచ్చిన సమయంలో సునీల్ అనపర్తిలో ఉన్నారని గుర్తుచేశారు. పేర్ని నానికి ఆయన భార్య మీద అంత ప్రేమ ఉంటే పేదల బియ్యం బొక్కేవారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. పేర్ని నాని గోడౌన్ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లిన ప్రతి లారీ సీసీ ఫుటేజ్ టోల్ గేట్ల దగ్గర సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయని తెలిపారు. న్యాయాధికారి ఆదేశాలతోనే పేర్ని నాని భార్యను విచారించారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్న పేర్ని నానిని చూసి రాష్ట్ర ప్రజలంతా ఒక బఫూన్‌లా చూస్తున్నారు. నీలాంటి వాళ్లు రాజకీయాల్లో అనర్హులు.. నీపై అనర్హత వేటు- వేయాలి. గతంలో 6400 టిడ్కో ఇళ్లు కడితే పేదలు ఇవ్వడానికి మీకెందుకు మనసు రాలేదు.. ఇళ్ల స్థలాల పేరుతో భూములు కొని కమిషన్లకు పాల్పడ్డాడు. గ్రామాల్లో స్మశానాలను సైతం కాజేశారు. మెడికల్ కాలేజ్ భూముల కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కాగ్ మొట్టికాయలు వేయడం నిజం కాదా..? గిలకలదిండిలో సీఆర్జెడ్ భూములిస్తే పట్టాలు రావని ఆ నాడు మేము పోరాడం. కలెక్టర్‌ని నకిలీ పట్టాల విషయంలో కోర్టు మెట్లు- ఎక్కే పరిస్థితి తీసుకొచ్చావ్.. ఆ నాడు నేను పోరాట ఫలితంగానే నువ్వు అక్కడి పేదలకు భూములు కొని ఇచ్చారు.. ఆ భూముల కొనుగోళ్లలోనూ కమిషన్లు కొట్టు-కున్నారు. బందరుకోటలో గతంలో నువ్వు ఇచ్చిన దేవనబోయిన రాము భూములకు ఇప్పటికీ పట్టాలు రాని పరిస్థితి.. బందరు పోర్టును నేనే కట్టా.. నేనే కట్టా అంటు-న్నావ్..నాడు మేం చేసిన ఉద్యమ ఫలితమే బందర్ పోర్టు. 2006లో బందర్ పోర్టును రాజశేఖరరెడ్డి గోగులేరుకు తరలిస్తే నాకు అభ్యంతరం లేదని సంతకం పెట్టిన వ్యక్తివి నువ్వు.. ఆ తర్వాత మేం చేసిన ప్రజా ఉద్యమానికి దిగి వచ్చి మా అమ్మ మీద ఒట్టు-.. పెదపట్నంలోనే పోర్టు అన్న వ్యక్తివి కూడా నువ్వే.. 2014 ఎన్నికల్లో పోర్టు పనులు ప్రారంభించకపోతే కోనేరుసెంటర్‌లో మోకాళ్లపై నిలబడి ముక్కును నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న వ్యక్తి నువ్వు కాదా' అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నల వర్షం కురిపించారు. గత టీడీపీ ప్రభుత్వం 2014లో వచ్చిన తర్వాత ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ పర్చేజింగ్, భూసేకరణ పాలసీల కింద భూములు సేకరించాం. భూముల సేకరణలో అనేక ఇబ్బందులు పెట్టావ్. రెండుసార్లు జగన్‌ని తీసుకొచ్చి భూములు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశావ్.. వీటన్నింటినీ అధిగమించి గత టీ-డీపీ ప్రభుత్వంలో పోర్టు పనులు ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన మీరు ఆ పనులు ఆపివేశారు. గతంలో బాలశౌరి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి కొంత నిధులు తెస్తే ఎన్నికల ముందు పోర్టు పనులు ప్రారంభించారు. నేడు ఆ పనులను 67శాతం మేం పూర్తి చేశాం. 2026 జూన్ తర్వాత పోర్టును ఆపరేషన్‌లోకి తీసుకువస్తాం. ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను బెదిరించాలని చూస్తే సహించేది లేదు. అధికారులపై అభియోగాలు మోపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మసులా బీచ్ ఫెస్టివల్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు.. మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. మచిలీపట్నం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం' అని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

# ఇక్రిశాట్ స్కూల్‌ను సందర్శించిన పవన్

**మార్క్ శంకర్ అడ్మిషన్ కోసమేనని సమాచారం**



పటాన్‌చెరు,జూన్13 : ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరు వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్‌ను సందర్శించారు. ఒక తండ్రిగా తన విధి నిర్వహణ కోసం డిప్యూటీ- సిఎం సెలవు తీసుకున్నారని, కుమారుని అడ్మిషన్ కోసం ఆయన అక్కడికి వెళ్లారని సమాచారం. అడ్మిషన్‌కు సంబంధించి వివరాలను సేకరించారని, పాఠశాలలో సౌకర్యాలను కూడా తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక వార్త వెలువడలేదు. ఇటీవల సింగపూర్‌లో మార్క్ శంకర్ చదువుతున్న పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. మార్క్ శంకర్‌ను తీసుకువచ్చేందుకు చిరంజీవి, ఆయన భార్య సురేఖలతో కలిసి డిప్యూటీ- సిఎం పవన్ కళ్యాణ్ సింగపూర్ వెళ్లారు. మార్క్ శంకర్‌ను ఇక్కడికి తీసుకుని వచ్చేందుకు నిర్ణయించి ఇక్రిశాట్ ఐఎస్‌హెచ్‌ను సందర్శించి.. అక్కడి టీచర్లతో మాట్లాడారు. కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌ను ఇక్రిశాట్‌లో చేర్పించేందుకే పవన్ అక్కడకు వెళ్లినట్లు- తెలుస్తోంది. సింగపూర్‌లోని స్కూల్‌లో జరిగిన ప్రమాదంలో పవన్, అన్నా లెజినోవా కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారు. ఈ ఘటనలో మార్క్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అంతేకాకుండా ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో ఇబ్బందిపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే మార్క్ శంకర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. కుమారిడికి ప్రమాదం జరిగిన సమయంలో పవన్ కళ్యాణ్ అల్లూరి సీతారామారాజు జిల్లా అరకు పర్యటనలో ఉన్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ- సీఎం హుటాహుటిన సింగపూర్‌కు వెళ్లారు. అక్కడ చికిత్స తరువాత మార్క్ శంకర్‌ను ఇండియాకు తీసుకుని వచ్చేశారు. అనంతరం ఇక్కడ కూడా కొద్దిరోజుల పాటు- చిన్నారికి చికిత్స చేయించారు. ఇప్పుడు మార్క్ శంకర్ పూర్తిగా కోలుకున్నారు. ఈ ఘటన తర్వాత కుమారుడు మార్క్ శంకర్‌ను ఇండియాలోనే చదవించాలని పవన్ నిర్ణయించినట్లు- సమాచారం. అందులో భాగంగానే పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో మార్క్‌ను చేర్చించేందుకే అడ్మిషన్ కోసం పవన్ అక్కడకు వెళ్లినట్లు- తెలుస్తోంది.

# కొమ్మినేనికి బెయిల్..చంద్రబాబుకు చెంపపెట్టు

**మహిళల ముసుగుతో సాక్షి కార్యాలయాలపై దాడులు**

**వైకాపా అధినేత జగన్ ఘాటు వ్యాఖ్యలు**

అమరావతి : నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న..ఏపి సిఎం చంద్రబాబు నాయుడుకు సుప్రీం కోర్టు గట్టిగా బుద్ధి చెప్పిందని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీనియర్ జర్నలిస్టు కెఎస్ఆర్ ను వెంటనే విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబుకు చెంపపెట్టు వంటిదని అన్నారు. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు..తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదాహం అని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ఎల్లో ముఠాతో కలిసి చంద్రబాబు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి, తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేనికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని సాక్షి మీడియా యూనిట్ ఆఫీసులమీద, కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా నిన్న మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోంది. విశ్లేషకుడు వ్యాఖ్యలతో యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేనికి ఏం సంబంధం అంటూ? ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు- కావు'అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# సిఆర్‌డిఏ టెంటర్లకు ఆమోదం

**అదికారులతో సమీక్షలో సిఎం నిర్ణయం**

అమరావతి,జూన్13 : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో సీఆర్‌డీఏ అథారిటీ- 49వ సమావేశం జరిగింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని 1,450 ఎకరాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 1,052 కోట్లతో టెండర్లు పిలవడానికి ఆమోదించింది. సీడ్ యాక్సెస్ రోడ్‌ను నేషనల్ హైవేకు కలిపేందుకు రూ.682 కోట్లతో టెండరు పిలవాలని నిర్ణయించారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ- నిర్మాణంపై నిపుణులతో మాట్లాడామని పట్టాణాభివృద్ధి శాఖమంత్రి నారాయణ తెలిపారు. ఉత్తర ప్రదేశ్ పర్యటనలో లక్నో లో రివర్ బండ్ ఎలా కట్టారు.. అక్కడ సాలిడ్ వేస్ట్ ప్లాంట్లు- ఎలా ఉన్నాయనేది అధ్యయనం చేశామన్నారు. యూపీ అధికారులు కూడా ఇక్కడకు వచ్చి సాలిడ్ వేస్ట్ ప్లాంట్లపై అధ్యయనం చేయనున్నారని వివరించారు.

# కొమ్మినేని కేసులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

**బురదరాజకీయాలు చేసిన కూటమి పార్టీలు**

**వైకాపా మహిళా విభాగం అధ్యక్షురాలు కళ్యాణి**

అమరావతి,జూన్13 : సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్‌పై సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలను కించపరిచారంటూ లేని దానిని ఆపాదిస్తూ కూటమి పార్టీల నేతలు తాము చేసిన బురద రాజకీయంకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం సృష్టించాలనుకుంటే కుదరదనే విధంగా సుప్రీంకోర్ట్ తీర్పు ప్రజాస్వామిక స్ఫూర్తిని నిలబెట్టిందని అన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, పత్రికాస్వేచ్ఛను పరిరక్షిస్తూ సుప్రీంకోర్ట్ కొమ్మినేని అరెస్ట్‌పై ఇచ్చిన ఉత్తర్వులను ప్రజలు స్వాగతిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత రెడ్‌బుక్ రాజ్యాంగాలు చెల్లవు, భారత రాజ్యాంగం ప్రకారమే ఎవరైనా పాలన చేయాలని మరోసారి సుప్రీంకోర్ట్ తన తాజా ఉత్తర్వులతో చెప్పినట్లయ్యింది. ఏపీలో ఏడాది పాలనలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేదు. అమరావతి పేరుతో పెద్ద ఎత్తున దోపిడీకి తెగబడ్డారు. తన అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్, సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులతో ఒక అరాచకాన్ని సృష్టించారు. అటు-వంటి భయానక పరిస్థితుల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని పరిరక్షిస్తూ సుప్రీంకోర్ట్ ఈ రోజు వెలువరించిన తీర్పు చంద్రబాబు అరాచకాలకు గొడ్డలిపెట్టు-. గడిచిన మూడు రోజులుగా మహిళలను అవమానించారనే వక్రీకరణలను ఆపాదిస్తూ వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతమ్మ, సాక్షి మీడియా పైనా, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుపైనా చేసిన దుష్ప్రచారం, కూటమి ప్రభుత్వ కుట్రలు సుప్రీంకోర్ట్ ఉత్తర్వులతో మొత్తం దేశమంతా తెలిసింది. ఇటు-వంటి దుర్మార్గానికి పాల్పడిన వారంతా వైఎస్ జగన్, వైఎస్ భారతమ్మకు క్షమాపణలు చెప్పాలి. ఈ వివాదాన్ని రెచ్చగొట్టేలా చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఇప్పటి-కై-నా సుప్రీంకోర్ట్ ఉత్తర్వులతో తన బుద్ధి మార్చుకోవాలి. బాధ్యతాయుతమైన మహిళా మంత్రులు పోలీస్ స్టేషన్‌లకు వెళ్ళి ఫిర్యాదులు ఇచ్చి, తప్పుడు కేసులు బనాయించేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారు. ఇటు-వంటి తప్పుడు విధానాలకు పాల్పడినందుకు వారు తమ పదవులకు రాజీనామా చేయాలి' అని ఆమె డిమాండ్ చేశారు.

# విజయ్ మన మధ్యలో లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేను

**పాలనలో తనదైన ముద్ర వేసిన నేత రూపానీ**

**విజయ్ రూపానీ కుటుంబానికి మోడీ పరామర్శ**

అహ్మదాబాద్,జూన్13 : ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ మాజీ సీఎం విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అసువులు బాసిన వాళ్లలో విజయ్ రూపానీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. ప్రమాదం నేపథ్యంలో గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల యోగక్షేమాలు అడిగారు. అనంతరం విజయ్ రూపానీ ఇంటికివెళ్లి కుటుంబసభ్యులతో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పీఎం మోదీ.. విజయ్‌భాయ్ మన మధ్య లేరనేది ఊహించలేనిదన్నారు. తనకు దశాబ్దాలుగా ఆయన తెలుసన్న మోదీ.. భుజం భుజం కలిపి.. తామిద్దరం కలిసి పనిచేశామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అత్యంత సవాలుతో కూడిన సమయాల్లో కూడా విజయ్‌భాయ్ వినయపూర్వకంగా కష్టపడి పనిచేసేవారని మోదీ అన్నారు. పార్టీ సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి ఉండేవారని, ఉన్నత స్థాయికి ఎదిగి, వివిధ బాధ్యతలను నిర్వహించి, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంతో శ్రద్ధాశక్తులతో సేవలందించారని మోదీ కీర్తించారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అయినా, రాజ్యసభ ఎంపీగా అయినా, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా అయినా, క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా అయినా, ఆయనకు కేటాయించిన ప్రతి బాధ్యతలోనూ ఆయన ఎల్లప్పుడూ ఒక ప్రత్యేకమైన ప్రతిభను కనబరిచారని మోదీ చెప్పారు. విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని, గుజరాత్ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆయన అనేక చర్యలు తీసుకున్నారని ప్రధాని మోదీ అన్నారు.

# మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం


**సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు**

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి సంబంధించి ఇద్దరు వైద్యులు సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. తక్షణమే సుమోటోగా విచారణ చేపట్టి, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు అహ్మదాబాద్‌లోని బిజె మెడికల్ కాలేజీ రెసిడెంట్ వైద్యులతో సహా ఒక్కొక్కరికి రూ.50 లక్షల మధ్యంతర పరిహారాన్ని వెంటనే ప్రకటించాలని, వెంటనే పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, విమానయాన నిపుణులు, ఆర్థికవేత్తలు, బీమా సంస్థల నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు- చేయాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. త్రివేణి కోడ్కనీ వర్సెస్ ఎయిర్ ఇండియా లిమిటెడ్ కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటు- చేసిన సూత్రాల ప్రకారం.. బాధిత కుటుంబాలకు తుది పరిహారాన్ని ఈ కమిటీ నిర్ణయించాలని స్పష్టం చేశారు. పరిహారం క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడానికి ఎయిర్ ఇండియా లిమిటెడ్‌ను ఆదేశించాలని పిటిషన్ కోరారు. మృతులకు అర్హులైన బంధువులకు పునరావాస సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశర చేయాలని పిటిషన్‌లో కోరారు.





## కుబేరా ప్రీఈవెంట్ వాయిదా...15కు రీషెడ్యూల్

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. అహ్మదాబాద్ విమానప్రమాదం కారణంగా వాయిదా వేశారు. ధనుష్, రష్మిక ,నాగార్జున కీలక పాత్రలో నటించారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో శుక్రవారం 'కుబేర' ఈవెంట్ నిర్వహించాలని టీమ్ భావించింది. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తిరిగి జూన్ 15న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పింది. ముందు అనుకున్నవిధంగానే హైదరాబాద్‌లోనే ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇందులో హవాలా, మనీలాండరింగ్ తదితర అంశాలు మిళితమై ఉంటాయి. దీంట్లో నటులు ఎక్కడా కనిపించరు. కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయని పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో దీనిని విడుదల చేయనున్నట్లు- చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన 'కుబేర' ఈనెల 20న విడుదల కానుంది.





## జూన్ 22న జననాయగన్ గ్లింప్స్ విడుదల

తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మరికొన్ని రోజుల్లో సినిమాలు దూరమవుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ తమిళ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించాడు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయల్లోనే ఉంటానని.. ఇదే తన చివరి చిత్రం అంటూ దళపతి69 ప్రాజెక్ట్‌ను ప్రారంభించాడు. జన నాయగన్ (ప్రజల నాయకుడు) అనే టైటిల్‌తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కార్తీ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. మరో 8 రోజుల్లో విజయ్ పుట్టినరోజు రాబోతుంది. ఈ సందర్భంగా అభిమానుల కోసం మేకర్స్ భారీ సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు- తెలుస్తుంది. జూన్ 22న జననాయగన్ ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేస్తున్నట్లు- సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మిస్తుంది. పూజ హెగ్దేతో పాటు- ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాను జనవరి 09 2026న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది.



## రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ లేనట్లేనా?


రామ్ చరణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా రూపొందే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. నిజానికి అదేమీ లేదని అర్థమయ్యేలా త్రివిక్రమ్ తరఫున నిర్మాత నాగ వంశీ ఒక ట్వీట్ వేశాడు. ప్రస్తుతానికి వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను మాత్రమే త్రివిక్రమ్ ఫైనల్ చేశారని, ఆయనకు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా తాను సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తానని చెప్పాడు. అయితే, రామ్ చరణ్‌తో సినిమా ఉంటుందా, ఉండదా అనే చర్చపై అనేక వార్తలు వస్తున్నాయి. కానీ, ఇప్పట్లో రామ్ చరణ్ త్రివిక్రమ్‌తో సినిమా చేసే అవకాశం లేదు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా సైన్ చేశాడు. ఆ సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాలనుకున్నాడు, కానీ కొన్ని అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టేశాడు. తాజా సమాచారం ప్రకారం, రామ్ చరణ్ సుకుమార్ సినిమా పూర్తయిన వెంటనే సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సినిమా దాదాపు ఫైనల్ అయినప్పటికీ, అధికారికంగా అనౌన్స్ చేయకపోతే నిజమని చెప్పలేం. కాబట్టి, త్రివిక్రమ్- రామ్ చరణ్ సినిమా ప్రస్తుతానికి ఆగిపోయింది. భవిష్యత్తులో ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. త్రివిక్రమ్ చెప్పిన కథ రామ్ చరణ్‌కు నచ్చినప్పటికీ, అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టినట్లు- తెలుస్తోంది.





## రివాల్వర్ రాణి ఆగమనం

వివాహానంతరం సినిమాల్ని బాగా తగ్గించింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలు మాత్రమే ఉన్నాయి. తాజాగా ఈ భామ 'రివాల్వర్ రీటా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నది. దాదాపు రెండేళ్ల క్రితం మొదలైన ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. వినాయక చవితి సందర్భంగా ఆగస్ట్ 27న 'రివాల్వర్ రీటా' సందడి చేయబోతున్నది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. ఈ సందర్భంగా కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. దీనిని కీర్తి సురేష్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పంచుకుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కీర్తి సురేష్ చేసిన పోరాటాలు, పండించిన కామెడీ హైలైట్‌గా నిలిచాయి. తన కెరీర్‌లో ఇదొక వైవిధ్యమైన చిత్రమని, ఇందులో తొలిసారి యాక్షన్ ఎపిసోడ్స్ చేశానని కీర్తి సురేష్ చెప్పింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తమిళంలో 'కన్నివీడి' చిత్రంలో నటిస్తున్నది.




## రాజాసాబ్ టీజర్ విజువల్స్ లీక్

### షేర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' జూన్ 16న ఈ సినిమా టీజర్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనికి లీకుల బెడద మొదలైంది. టీజర్ విజువల్ వీడియోలు కొన్ని నెట్టింట లీక్ అయ్యాయి. దీనిపై టీమ్ స్పందించింది. లీక్ కంటెంట్‌ను షేర్ చేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్' కంటెంట్‌కు సంబంధించిన అనధికారక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని దానికి అందరూ సహకరించాలని కోరింది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది. దీని టీజర్ జూన్ 16న రిలీజ్ చేయనున్నట్లు టీ-మ్ ఇప్పటికే ప్రకటించింది. ఈ టీజర్ రిలీజ్ కోసం ఓ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేసినట్లు- వార్తలు వస్తున్నాయి. దీనికోసం జాతీయ మీడియాకు కూడా ఆహ్వానాలు అందినట్లు- సమాచారం. ఈ ఈవెంట్‌లో 'రాజాసాబ్' కోసం వేసిన భారీ సెట్‌ను కూడా చూపించనున్నట్లు- తెలుస్తోంది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## అమితాబ్ వర్క్ హాలిక్

### 2 గంటల్లోనే యాడ్ ఫిలిం పూర్తి చేశా

అమితాబ్ బచ్చన్ 82 ఏళ్ల వయసులోనూ చలాకీగా చురుకుగా ఉంటారు. పని ఉంటే ఠక్కున పూర్తి చేస్తారు. సినిమా షూటింగ్‌లు కూడా ఇలాగే పూర్తి చేస్తారు. తన డైలీ లైఫ ÷-టసైల్‌ను తెలియజేస్తూ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ తరచూ బ్లాగ్‌లో పోస్టులు పెడుతుంటారు. తాజాగా ఆయన తన వర్క్ లైఫ్ గురించి పోస్ట్ పెట్టారు. సుమారు 2 గంటల్లోనే తాను చాలా వర్క్బ చేశానని చెప్పారు. వర్క్‌లో తన స్పీడ్ చూసి ఒక దర్శకుడు చమత్కారం చేశాడని అన్నారు. ఇంత స్పీడ్‌గా వర్క్ చేయడం కరెక్ట్ కాదని దర్శకుడు తనతో చెప్పారని ఆయన పేర్కొన్నారు. పని చేయడంలో ఎంతో ఆనందం ఉంటుంది. కేవలం రెండు గంటల్లో ఐదు సినిమాలు, రెండు ఫొటోషూట్‌ల కోసం వర్క్ చేశా. అవన్నీ కూడా ఒక వాణిజ్య ప్రకటన కోసమే అయినప్పటికీ ఇంత త్వరగా వాటిని పూర్తి చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది. వర్క్‌లో నా స్పీడ్ చూసి దర్శకుడు, సిబ్బంది షాకయ్యారు. పని చేసే విధానాన్ని నేను పాడుచేస్తున్నానంటూ ఆయన చమత్కారం చేశారు. కానీ, నాకు మాత్రం ఇలా వర్క్ చేయడం చాలా సంతోషంగా అనిపించింది. సినిమా పైనే ఆధారపడే ఎంతోమంది కార్మికులను దృష్టిలో ఉంచుకుని వారి కోసమే నేను వరుస వర్క్బ చేస్తున్నా అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. తాను కెరీర్ ప్రారంభించిన నాటినుంచి ఇప్పటివరకూ సినీ ప్రపంచంలో తాను ఎన్నో మార్పులు చూశానని ఆయన రాసుకొచ్చారు. ఈ వయసులోనూ ఆయన వరుసగా ప్రాజెక్టులు చేయడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com